
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025





హద్దుమీరిన పెత్తనం

జిల్లా పరిషత్ వ్యవహారాల్లో చైర్‌పర్సన్ భర్త పెత్తనం హద్దు మీరిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధులు లేకున్నా రూ.24.37 కోట్ల అంచనాలతో 424 పనులకు సమావేశంలో అనుమతులు ఇచ్చేశారు. తీరా నిధులు సమకూరకపోవడంతో జెడ్పీ సీఈవో ఆ పనులను నిలిపివేశారు. దీంతో రెచ్చిపోయిన చైర్‌పర్సన్ భర్త జెడ్పీ అధికారులు, ఉద్యోగులకు ఫోన్ చేసి తిట్ల దండకం అందుకున్నాడు. మాకు తెలియకుండా మీ ఇష్టం వచ్చినట్టు చేస్తారా అంటూ మండిపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన ప్లానింగ్ విభాగం సూపరింటెండెంట్ తోటి ఉద్యోగులతో కలిసి జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ భర్త తీరుపై విమర్శలు

రూ.24.37 కోట్ల అంచనాలతో 424 పనులకు గత సమావేశంలో అనుమతులు

- నిధులు సమకూరక పనులు నిలిపేస్తూ ఇటీవల జెడ్పీ సీఈవో ఉత్తర్వులు
- ప్లానింగ్ విభాగం మహిళా సూపరింటెండెంట్‌పై జెడ్పీ చైర్‌పర్సన్ భర్త తిట్లదండకం
- మాకు తెలియకుండా మీ ఇష్టం వచ్చినట్టు చేస్తారా అంటూ ఆగ్రహం
- తోటి ఉద్యోగులతో కలిసి జెడ్పీ సీఈవోకు బాధిత అధికారి ఫిర్యాదు
- భవిష్యత్తులో మళ్లీ జరగకుండా కలెక్టర్, సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగుల నిర్ణయం



జిల్లాపరిషత్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్‌లో మరో వివాదం రాజుకుంది. నిధులు అందుబాటులో లేకున్నా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేశారు. ఆ తర్వాత జెడ్పీలో సరిపడా నిధులు అందుబాటులో లేవనే కారణం చూపి, మళ్లీ అనుమతులు మిగతా 6లో..

424 పనులు నిలిపివేత

ఈ ఏడాది మే, సెప్టెంబరు నెలల్లో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో జల్లా పరిషత్ సాధారణ నిధులతో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ గ్రామాల్లో 424 పనులను రూ.24.37 కోట్ల అంచనాలతో చేయాలని నిర్ణయించారు. ఈ పనుల అంచనాలను పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు తయారు చేసి జెడ్పీ అధికారులకు నివేదిక ఇచ్చారు. జెడ్పీకి సంబంధించిన సెక్టారియల్ నిధులతో 155 పనులను రూ.8.26 కోట్లతో, షెడ్యూలు కులాలవారు నివసించే ప్రాంతాల్లో 44 పనులను రూ.3.16 కోట్లతో, జెడ్పీ జనరల్ ఫండ్స్‌తో 225 పనులను 12.94 కోట్లతో చేయాలని నిర్ణయించారు. పనులకు ఆమోదం తెలిపినా.. అక్టోబరు నాటికి జెడ్పీకి ఈ నిధులు సమకూరక పోవడంతో నిధుల కొరత కారణంగా ఆమోదం పొంది, ఇంకా పనులు ప్రారంభించని ఈ పనులను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు తక్షణమే నిలిపివేయాలని ఈ నెల 21వ తేదీన జెడ్పీ సీఈవో కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలకు అదే రోజు పంపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ భర్త కనుసన్నల్లోనే..

జిల్లా పరిషత్ నిధులతో 424 పనుల కేటాయింపునకు సంబంధించిన వ్యవహారమంతా జెడ్పీ చైర్‌పర్సన్ భర్త కనుసన్నల్లోనే నడిచిందని జెడ్పీ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. జెడ్పీ సాధారణ నిధులతో ఈ పనులు చేసేందుకు ఆమోదం తెలిపినా, నిధుల కొరత కారణంగా మూడు సంవత్సరాలకు గాని ఈ పనులకు బిల్లులు చెల్లింపులు చేసే అవకాశం లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లకు ఈ పనులు అప్పగించి, చేసుకోమని చెప్పిన తర్వాత ఈ పనులను నిలిపివేస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేయడంతో జెడ్పీ చైర్‌పర్సన్ భర్త ఆగ్రహంతో ఊగిపోయినట్టు తెలిసింది. తనదైన శైలిలో ఉద్యోగులు, అధికారులపై తిట్ల దండకం అందుకున్నట్టు జెడ్పీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనాజిర్ జిలాని సామూన్, జేసీ నవీన్ తదితరులు



ప్రతి రైతూ ఒక శాస్త్రవేత్త కావాలి

» ఘంటసాలలో రైతన్నా మీ కోసం ఘనంగా ప్రారంభం

రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఘంటసాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడిన ప్రతి రైతూ ఒక శాస్త్రవేత్త కావాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఘంటసాలలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగం వ్యవసాయ రంగమన్నారు. ఈ రంగంపై నూటికి 64 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రైతాంగ సమస్యలకు సీఎం చంద్రబాబు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేస్తున్నారని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వివిధ పంటలకు గిట్టుబాటు ధర కూడా అందిస్తుందని స్పష్టం చేశారు. రైతును రాజుగా చేసేందుకు సీఎం చంద్రబాబు సూచించిన ఐదు విధానాలు రైతుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, ప్రభుత్వం నుంచి రైతులకు మద్దతు ఈ ఐదు విధానాల గురించి రైతులకు ఆయన వివరించారు. సంపద సృష్టించటానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వివరించారు. వ్యవసాయశాఖ రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయానికి సీఎం చంద్రబాబు మిగతా 6లో..

పట్టాభి స్మారక భవనం నిర్మించి తీరుతాం • మంత్రి కొల్లు రవీంద్ర 8

కబడ్డీ విజేతలు కృష్ణా, కర్నూలు జట్లు 6

ధాన్యం పంపేదెలా?

వేధిస్తున్న రవాణా వాహనాల కొరత

» గోతాలు లేక కల్లాల్లోనే ధాన్యం
» వరికోతలకు దొరకని యంత్రాలు
» తుఫాను భయంతో అన్నదాతల అవస్థలు

వరి కోతలు ముమ్మరం కావటంతో రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ధాన్యం రవాణాకు వాహనాలే దొరకటం లేదు. సరిపడా గోనె సంచులు లేక కల్లాల్లోనే ధాన్యం ఉండిపోతోంది. దీనికి తోడు కోతలకు యంత్రాలు అందుబాటులో ఉండకపోవడం, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


ఆరబెట్టిన ధాన్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో వరి కోతలు ముమ్మరం కావడంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించటానికి సిద్ధమవుతున్న దశలో రైతులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. ధాన్యం కొనుగోలుకు బుక్ చేసుకున్న రైతులకు వాహనాలు సమకూరటం లేదు. రోజుల తరబడి వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. వాహనాలను సమకూర్చటంలో జిల్లా యంత్రాంగాలు విఫలమయ్యాయి. ధాన్యం సేకరణకు జీపీఎస్ ఉన్న వాహనాలనే తీసుకోవాలన్న నిబంధనలు విధించటంతో ఈ సమస్య ఏర్పడుతోంది. వాహనాలను సమకూర్చే బాధ్యత రవాణా శాఖకు అప్పగించటం జరిగింది. రవాణా శాఖ ట్రాక్టర్లు, లారీలను సమీకరించటానికి కష్టపడాల్సి వస్తోంది. జీపీఎస్ ఉన్న వాహనాలనే సమీకరించాలని రవాణా శాఖకు నిర్దేశించటంతో.. వాహన యజమానుల నుంచి వాటిని సమీకరించే క్రమంలో జీపీఎస్‌లను బిగించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో వాహన మిగతా 6లో..

తలోదారి!

జిల్లాల పునర్విభజన అంశం ఉమ్మడి కృష్ణాజిల్లాలో గందరగోళం సృష్టిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీతో ముందుకు వెళ్తుంటే ప్రజాప్రతినిధులు సరికొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు. గన్నవరం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అడుగులు వేస్తుంటే.. పెనమలూరు ప్రజల అభీష్టానికి విరుద్ధంగా అక్కడి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వెళ్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇంతలో గన్నవరం, పెనమలూరు ఎన్టీఆర్ జిల్లాలో కలిస్తే కృష్ణాజిల్లా చిన్నదైపోతుందని మంత్రి కొల్లు రవీంద్ర మరో వాదన అందుకున్నట్టు తెలిసింది. ఈ అంశాలపై ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది.

గత వైపీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా జిల్లాల విభజన

సమస్యలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం

» గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపటానికి ప్రభుత్వ విప్ యార్లగడ్డ సై
» ఎన్టీఆర్ జిల్లాలో పెనమలూరు నియోజకవర్గాన్ని కలపటానికి ఎమ్మెల్యే బోడె నై!
» గన్నవరం, పెనమలూరు ఎన్టీఆర్‌లో కలిపితే కృష్ణా చిన్నదైపోతుందట!
» మంత్రి కొల్లు రవీంద్ర వాదనతో గందరగోళం!
» ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు
» సీఎం సమావేశంలో గన్నవరం, పెనమలూరు, నూజివీడుపై తీవ్ర చర్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లాల పునర్విభజన చిక్కుముడులను విప్పేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంటే ప్రజాప్రతినిధులు మాత్రం కొత్త వాదనలతో గందరగోళం సృష్టించేలా వ్యవహరించటం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాడు జిల్లాల విభజనలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం నాలుగు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రయత్నిస్తోంది. ఇందులో ప్రధానంగా ఒక నియోజకవర్గం ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలని నిర్దేశిస్తోంది. ఈ విధానాన్ని ఖచ్చితంగా నూరుశాతం అమలు చేయాల్సిందేనన్నది ప్రభుత్వ నిర్ణయంగా తెలుస్తోంది. జిల్లా పరిపాలనా కేంద్రానికి దగ్గరగా ఉండాలన్నది రెండవ అంశం కాగా.. ప్రజలు రాకపోకలకు దగ్గరగా ఉండాలన్నది మూడవ అంశం. వీటన్నింటికీ మించి ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను సరిచేయటం అన్నది నాల్గవది.


యార్లగడ్డ వెంకట్రావు
కొల్లు రవీంద్ర
బోడె ప్రసాద్

ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు

ప్రభుత్వ ఆలోచనా విధానాలు గత ప్రభుత్వం వేసిన తప్పులకు పరిష్కారం చూపించబోతుండగా.. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కొంత మంది ప్రజాప్రతినిధులు తమ స్వార్థ ప్రయోజనాలను చూసుకుంటున్నారన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. విజయవాడకు అత్యంత సమీపంలో ఉన్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలన్నది గత ప్రభుత్వం నుంచి స్థానిక ప్రజల డిమాండ్‌గా ఉంది. గన్నవరం కంటే కూడా పెనమలూరు నియోజకవర్గం విజయవాడను ఆనుకుని ఉంది. పెనమలూరు ప్రజలు విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయానికి రావటం దగ్గరగా ఉంటుంది. పైగా విజయవాడ గ్రేటర్ విలీన జాబితాలో ఈ నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు మండలాలు ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గ మిగతా 6లో..

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై వేటు

» విద్యాసాగర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్ లక్ష్మీశ
» ఎ.కొండూరులో రక్షిత మంచినీటి పథకాల అమల్లో నిర్లక్ష్యం
» ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏ పని కూడా ముందుకు కదలని దుస్థితి
» ఈఈగా వచ్చి ఎస్ఈగానూ అదనపు బాధ్యతలు
» ఏ బాధ్యతను కూడా సక్రమంగా నిర్వహించని విద్యాసాగర్
» ఏడాదిగా ఓర్పు పట్టిన కలెక్టర్.. ఇక లాభం లేదని సరెండర్


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
విద్యాసాగర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) విద్యాసాగర్‌పై వేటు పడింది. ఆయన్ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తిరువూరు నియోజకవర్గంలోని ఏ.కొండూరు, గంపలగూడెం మండలంలో రోజురోజుకు కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం తాగునీటి సమస్యే. ఈ అంశాలపై 'ఆంధ్రజ్యోతి' సోమవారం 'జీవచ్ఛవాలు' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. మరో ఉద్దానంగా మారిపోతుందని పేర్కొంది. దీనిపై స్పందించిక కలెక్టర్ లక్ష్మీశ రక్షిత మంచినీటి ప్రాజెక్టుల విషయంలో అంతులేని తాత్సారానికి ఎస్ఈని బాధ్యుడిని చేస్తూ ఆయన సేవలు ఇక అవసరం లేదని భావించారు. ఆయన్ను సాగనంపటమే సముచితమని సంచలన నిర్ణయం తీసుకున్నారు. విద్యాసాగర్ స్థానంలో జిల్లాకు మరో అధికారిని ఇవ్వాల్సింది కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఓ ఎగ్జిక్యూటివ్ మిగతా 6లో..

మళ్లీ మైనింగ్!

తవ్వకాలకు అనుమతులపై ప్రజాగ్రహం

విజయవాడ రూరల్ మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగిన మైనింగ్ అక్రమాలపై స్థానికులు తీవ్ర స్థాయిలో పోరాటం చేశారు. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం కోట్ల రూపాయల విలువైన మట్టిని అక్రమంగా తరలించినట్టు నిర్ధారించారు. రికవరీకి నోటీసులు జారీ చేశారు. కానీ నేటి వరకు రూపాయి కూడా రికవరీ కాకపోగా, మళ్లీ మైనింగ్ తవ్వకాలకు అక్కడే అధికారులు అనుమతులు ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించారు.

» గతంలో జరిగిన అక్రమాలపై నేటికీ చర్యలు శూన్యం
» జేసీ ఇలక్కియాకు విజయవాడ రూరల్ మండల ప్రజల ఫిర్యాదు
» నూతన అనుమతులపై మైనింగ్ అధికారిని ప్రశ్నించిన జేసీ
» క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడైతే అక్రమ తవ్వకాలు జరిగాయో.. వాటి పక్కనే మళ్లీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంపై విజయవాడ రూరల్, జి.కొండూరు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజల ఫిర్యాదులు, పోరాటాల మేరకు ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయలు తూట్లు పొడిచిన అక్రమార్కుల నుంచి రికవరీ అస్త్రం ప్రయోగించినా బెడిసి కొట్టింది. రికవరీలు చేయకపోగా.. కొత్తగా అనుమతులు ఇచ్చే విషయంలో కూడా అధికారులు నిబంధనలు సక్రమంగా పాటించటం లేదని సోమవారం గ్రీవెన్స్‌లో జేసీ ఇలక్కియాకు ఆయా మండలాల ప్రజలు ఫిర్యాదు చేశారు. పట్టా భూముల్లో అనుమతులు ఇస్తున్నామని చెబుతున్న అధికారులు.. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే.. సరిహద్దులను నిర్ణయించకుండానే అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన తర్వాతే.. అనుమతుల లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు.


వైసీపీ ప్రభుత్వంలో మట్టి తవ్వకాలు(ఫైల్)

గనుల శాఖ అధికారిని వివరణ కోరిన జేసీ

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై జేసీ ఇలక్కియా సుదీర్ఘంగా విచారించారు. గనుల శాఖ అధికారిని పిలిచి వివరణ కోరారు. దీనిపై గనుల శాఖ అధికారి పట్టా భూముల్లోనే అనుమతులు ఇచ్చామని సమర్థించుకున్నారు. గతంలో ప్రభుత్వ భూముల్లో తవ్విన దాని పక్కనే అనుమతులు ఇచ్చారని జమలయ్య అనే స్థానికుడు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ తవ్వకాలు జరిగిన మిగతా 6లో..



స్పేస్ ఆన్ వీల్స్

- బెజవాడలోకి అంతరిక్ష సాంకేతికత
- ఇస్రో ప్రయోగాలను వీక్షించిన విద్యార్థులు

అంతుపట్టని అంతరిక్ష విజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో జరిగే ఇస్రో ప్రయోగాలు విజయవాడలో ఆవిష్కృతమయ్యాయి. రాకెట్‌ల తయారీ నుంచి అవి ఎగిరే తీరు, ల్యాండింగ్ విధానం.. ఇలా అన్నీ విషయాలను చక్రాలపై మోసుకొచ్చింది. 'స్పేస్ ఆన్ వీల్స్' పేరుతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యక్షమైన బస్సు వేలాది మందికి అంతరిక్ష మధురానుభూతిని పంచింది. 6



8

కృష్ణవేణమ్మకు మహాచీర



కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరం పక్కన ఏర్పాటు చేసిన స్పేస్ ఆన్‌వీల్స్ బస్సులో అంతరిక్ష విశేషాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



స్పేస్ ఆన్ వీల్స్

- నగరంలోకి అంతరిక్ష సాంకేతికత
- ఇస్రో ప్రయోగాలను వీక్షించిన విద్యార్థులు
- కలెక్టరేట్‌లో ముగిసిన మూడురోజుల సందర్శన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

భావితరాలకు బాటలు వేసే నేటి తరం విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ విజయవాడలో 'స్పేస్ ఆన్ వీల్స్' ఏర్పాటు చేయించారు. రాకెట్ రహస్యాలను ప్రతి ఒక్క విద్యార్థికి తెలియజెప్పాలనే ఆకాంక్షతో అంతరిక్ష విజ్ఞాన బస్సును నగరానికి తీసుకొచ్చారు. శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ ప్రత్యేకంగా తయారు చేసిన ఈ బస్సులో ఎన్నో అంతరిక్ష విశేషాలు దాగి ఉన్నాయి. సోమవారం స్పేస్ ఆన్‌వీల్స్ బస్సును తిలకించేందుకు విద్యార్థులు పోటెత్తారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమాశమందిరం పక్కన ఏర్పాటు చేసిన దీనిని చూసేందుకు జిల్లాలోని విజయవాడ, పెనమలూరు, గన్నవరం, విజయవాడ రూరల్, నందిగామ, కంచికచర్ల, గొల్లపూడి తదితర ప్రాంతాలతో పాటు నగర శివారులోని పెనమలూరు, గన్నవరం, కానూరు, మంగళగిరి, తాడేపల్లి, కుంచనపల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రవేట్ స్కూల్స్ విద్యార్థులు విచ్చేశారు. ఉదయం 9.30 గంటల నుంచే స్పేస్ సెంటర్‌ను చూసేందుకు విద్యార్థులు బారులుదీరారు. సాయంత్రం వరకు విద్యార్థుల వీక్షణ కొనసాగింది. సోమవారం ఒక్క రోజే దాదాపు 1,500 మంది విద్యార్థులు దీనిని సందర్శించినట్టు అధికారులు ప్రకటించారు. స్పేస్ సెంటర్ టెక్నికల్ ఆఫీసర్ వి.కిరణ్‌కుమార్ విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీని వివరించారు.

ఎన్నో విషయాలను మోసుకొచ్చిన 'స్పేస్ ఆన్ వీల్స్'

రాకెట్ రహస్యాలను 'స్పేస్ ఆన్ వీల్స్' బస్సు మోసుకొచ్చింది. 2008 అక్టోబరు 22న దేశం తొలిసారిగా చంద్రుడి పైకి విజయవంతంగా పంపిన చంద్రయాన్-1 మిషన్‌తో మొదలుకొని, మార్స్ పైకి పంపిన మంగళయాన్, చంద్రయాన్-3, ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(ఐఆర్ఎన్ఎస్ఎస్), చంద్రయాన్-2 స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి ఉపరితలంపై పంపిన ఫోటోలు, వీడియోలు, ఆస్ట్రోనాట్‌లు, పలురకాలైన రాకెట్‌లు(ఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ), రోవర్ సోలార్ పానెల్ డిప్లాయ్‌మెంట్, ఇండియన్ శాటిలైట్ కమ్యూనికేషన్ అప్లికేషన్స్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ పంపిన అద్భుతమైన చిత్రాలు, రాకెట్‌లో ఎల్‌హెచ్-2 ట్యాంక్, క్రాయో స్టేజ్, లోక్స్ ట్యాంక్, సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్(ఎస్‌డీఎస్‌సీ) షార్, శ్రీహరి కోట, ఆదిత్య ఎల్-1 మిషన్ కక్ష్యలో తిరిగే విధాన నమూనాలు ఈ బస్సులో నిక్షిప్తమై ఉన్నాయి.

చాలా మంచి ప్రోగ్రాం - జ్ఞానశ్రీ, గొల్లపూడి



స్పేస్‌లో జరిగే ఎన్నో విషయాలను తెలుసుకున్నా. చాలా మంచి ప్రోగ్రాం. రాకెట్‌లు తయారుచేసే విధానం నుంచి అవి ఎగిరే వరకు, స్పేస్‌లో తిరిగే విధానం చక్కగా వివరించారు. ఇవన్నీ ఇప్పటి వరకు పుస్తకాల్లోనే చూశాను. ఆ ప్రయోగాలను నేరుగా వీక్షించడం బాగుంది.

స్పేస్ స్టేషన్‌లో ఉన్నట్టుంది - లోహిత్, కుంచనపల్లి



బస్సు లోపలికి వెళ్లగానే స్పేస్ స్టేషన్‌లో తిరుగుతున్నట్టు ఉంది. చంద్రయాన్-1, 2, 3 పని తీరు బాగా నచ్చింది. అందులోనే చాలా టెక్నాలజీ ఉందనిపించింది. చంద్రుడిపై రోవర్ దిగుతున్న తీరు గతంలో టీవీలో చూశాను. కానీ ఈ బస్సులో చూస్తుంటే చాలా బాగుంది.

స్పేస్ టెక్నాలజీ మొత్తం ఇక్కడే ఉంది - వెంకటరాజేశ్వరి, సింగ్‌నగర్



స్పేస్ టెక్నాలజీ మొత్తం ఈ బస్సులోనే ఉందనిపించింది. ఇస్రోలో జరిగే రాకెట్‌ల తయారీ నుంచి, అవి ఎగిరే తీరు, ల్యాండింగ్ టెక్నాలజీ పూర్తిగా ఉంది. ఇండియన్ రీజనల్ నావిగేషన్ సిస్టమ్ పని తీరు బాగా నచ్చింది. ఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్‌లను కళ్లతో నేరుగా చూపినట్టు అనిపించింది.

చంద్రయాన్-4 గురించి ముందే తెలుసుకున్నా - దాక్షిణ్య, కానూరు



చంద్రయాన్, 1, 2, 3 గురించి పుస్తకాల్లో చదివేశాను. కానీ త్వరలో చంద్రయాన్-4 రాబోతోంది. దాని చరిత్ర, అది పనిచేసే తీరు ఇక్కడ ముందుగానే తెలుసుకున్నా. చంద్రుడిపై ఉన్న కొన్ని పదార్థాలను తీసుకొచ్చేందుకు చంద్రయాన్-4ను విష్కరిస్తున్నట్టు చెప్పారు. రాకెట్‌లలో వాడే హెచ్2వో, హైడ్రాలిక్స్ సిస్టమ్ గురించి తెలుసుకున్నాను.

స్పందన బాగుంది - వి.కిరణ్‌కుమార్, స్పేస్ సెంటర్ టెక్నికల్ ఆఫీసర్



ఈ బస్సు రాష్ట్రంలో ఇప్పటి వరకు చాలా ప్రదేశాల్లో తిరిగింది. ఇస్రో పనితీరును విద్యార్థులు వివరించేందుకే దీన్ని తయారు చేశాం. విజయవాడలో ఓ ప్రయివేటు స్కూల్ అభ్యర్థన మేరకు వచ్చాము. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ జి.లక్ష్మీశ పట్టుబట్టి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని అన్నీ స్కూల్స్‌కు మెసేజ్ పంపారు. విజయవాడలో విద్యార్థులు, విద్యా సంస్థల నుంచి మంచి స్పందన వచ్చింది. రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమం సోమవారంతో ముగిసింది.









అయ్యన్నపాత్రుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఇంద్రకీలాద్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు సోమవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 4గంటలకు సతీమణి, కుమారుడు బంధువులతో కలిసి ఆలయానికి విచ్చేసి ఖడ్గమాల సేవా టిక్కెట్లు కొనుగోలుచేసి పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏఈవో బీవీ రెడ్డి, సూపరింటెండెంట్ చందు శ్రీను, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ ఎల్.శ్రీనివాస్‌లు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు అయ్యన్నపాత్రుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

డీఎస్సీ-2025 టీచర్లకు జీతాలివ్వండి



మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు వెంటనే జీతాల బిల్లులు చెల్లించాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవూఫ్‌కు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం వినతిపత్రం సమర్పించారు. సోమవారం డీఈవో కార్యాలయంలో ఏడీని కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇన్‌సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు బీఈడీ చదువుకునేందుకు ఎన్వోసీలు ఇవ్వాలన్నారు.

కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష జేఏసీ ఛైర్మన్ కె. జాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌బాబు, కోశాధికారి ప్రశాంత్‌బాబు ధర్నాకు నేతృత్వం వహించారు. వివిధ మండలాల కో-ఆర్డినేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్‌ఎంపీలు, మండల అకౌంటెంట్‌లు, మెసెంజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాన్ మోడి, నాగార్జున, ప్రశాంతి, దుర్గాభవాని, రామకృష్ణలు మాట్లాడారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై వేటు

(5వ పేజీ తరువాయి)

ఇంజనీర్ (ఈఈ) గా పనిచేసే వ్యక్తిని ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈగా ఈఎన్‌సీ కార్యాలయం నియమించింది. కీలక జిల్లాల్లో సమర్థవంతమైన అధికారులను ఇవ్వాల్సిన ఈఎన్‌సీ కార్యాలయం అప్పట్లో కాసులకు కక్కుర్తి పడి ఎవరికి పడితే వారికి పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ సందర్భంలో ఈఈగా వచ్చిన విద్యాసాగర్‌కు ఎస్ఈగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటు ఈఈగా, ఇటు ఎస్ఈగా ఆయన తన విధులు నిర్వహించటంలో ఘోర నిర్లక్ష్యాన్ని చూపారు. జిల్లాలో రక్షిత మంచినీటి పనులు ఏ ఒక్కటి కూడా ముందుకు కదలలేదు. ఏడాది కాలంగా కలెక్టర్ లక్ష్మీశకు ఎస్ఈ విద్యాసాగర్ చిరాకు తెప్పిస్తున్నారు. ఎంతో ఓర్పుతో వ్యవహరిస్తున్న కలెక్టర్‌కు కీలకమైన ఏ కొండూరు రక్షిత మంచినీటి పథకాల పనుల్లో తీవ్ర అలసత్వం చూపటంతో సహించలేకపోయారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి పట్టించుకోకపోవటంతో పాటు ఎక్కడి పనులు అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. తిరువూరు నియోజకవర్గం మరో ఉద్దానంలా మారింది. రక్షిత మంచి నీటి పనులను పర్యవేక్షించకపోవటంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టడంతో పనులు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. టెండర్లు పిలవాల్సినవి కూడా సక్రమంగా చేపట్టలేని దుస్థితి ఏర్పడింది. టెండర్ల దగ్గర నుంచి పనుల వరకు ఏ అంశంలోనూ ఆయన సీరియస్‌గా దృష్టి సారించకపోవటంతో పాటు ఇక్కడి నుంచి వెళ్లిపోవడానికి తరచూ ప్రయత్నాలు చేయటంతో కలెక్టర్ కొద్ది కాలంగా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఎ.కొండూరులో సకాలంలో రక్షిత మంచినీటి పథకాలు అందుబాటులోకి తీసుకురాకపోవటంతో.. అక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడటంతో.. ఇక లాభం లేదని భావించిన కలెక్టర్ సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ప్రభుత్వానికి సరండర్ చేశారు.

ధాన్యం పంపేదెలా?

(5వ పేజీ తరువాయి)

యాజమానులు, రవాణా శాఖ అధికారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. వాహనాలు ఇవ్వటమే ఒక ఎత్తు అయితే .. వాటికి జీపీఎస్‌లను అమర్చటానికి యజమానులు ఆసక్తి చూపించటం లేదు. సొంత ఖర్చు పెట్టుకుని జీపీఎస్‌లను ఏర్పాటు చేయలేమని చెబుతున్నారు. జీపీఎస్‌లు ఏర్పాటు చేయాల్సిందేనని రవాణా శాఖ అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో యజమానులు, రవాణా శాఖ అధికారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తమ వాహనాలను ఇవ్వటానికి యజమానులు ఇష్టపడటం లేదు. ఈ ప్రభావం వాహనాల సమీకరణపై ప్రభావం చూపుతోంది. దీంతో తగిన సంఖ్యలో వాహనాలు అందని పరిస్థితి ఏర్పడుతోంది. రైతు సేవా కేంద్రాల నుంచి కస్టమ్ మిల్లులకు ధాన్యాన్ని పంపటానికి వాహనాలు దొరకటం కష్టంగా మారిపోయింది. సొంతంగా ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించే రైతులు వాహనాలు సమకూరక ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి 150 వాహనాలు తగ్గకుండా తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాలు నిర్దేశించినా.. యాభై.. అలోపు సంఖ్యలోనే వాహనాలను సమకూర్చినట్టుగా తెలుస్తోంది. జీపీఎస్ ఏర్పాటు చేయాలంటే రూ. 5 వేల ఆపైన ఖర్చు అవుతోంది. సొంత ఖర్చుతో జీపీఎస్ డివైజ్‌లను ఏర్పాటు చేయటానికి వాహనదారులు ఇష్టపడటం లేదు.దీంతో రైతులు పడుతున్న పాట్లు అన్నీ, ఇన్నీ కాకుండా ఉన్నాయి. నేరుగా ధాన్యాన్ని విక్రయించే రైతులకు వాహనాల కొరత ఏర్పడగా.. దళారీలకు మాత్రం వాహనాలు అందుబాటులో ఉంటున్నాయి.

వరి కోత యంత్రాలు దొరక్క అవస్థలు

వరి పంట కోతలకు వరి కోత యంత్రాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. వాతావరణం బాగోకపోవటంతో వరి కోత యంత్రాలకు మరింత డిమాండ్ ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు అనువుగా ఉంటే రైతులలో కంగారు ఉండేది కాదు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరికోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. పరిమితంగా వరికోత యంత్రాలు ఉండటం వల్ల కూడా ఈ సమస్య ఏర్పడుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి ఇంకా రావాల్సిన వరికోత యంత్రాలు కూడా ఉన్నాయి. అవి ఇంకా చేరలేదు. ఉన్న వరికోత యంత్రాలు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి. నాలుగు రోజులుగా రైతులు వరికోత యంత్రాల కోసం ఎదురుచూస్తున్నా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. కూలీలతో చేయించుకుందామంటే.. కాలాతీతం అవుతుంది. ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. దీంతో వరికోత యంత్రాల మీదనే ఆధారపడాల్సి వస్తోంది.

వేధిస్తున్న గోనె సంచుల కొరత

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో గోనె సంచులకు కూడా డిమాండ్ ఏర్పడింది. రైతు సేవా కేంద్రాలకు తగిన సంఖ్యలో గోనె సంచులు రాకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గోనె సంచుల కొరత కారణంగా రైతులు కల్లాల్లోనే ధాన్యం ఉంచాల్సి వస్తోంది. తుఫాను భయంతో గోనె సంచుల కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం విక్రయించిన రైతుకు ప్రభుత్వం ఒక్కరోజులోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తుంది. ఈ విషయంలో రైతులు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ గోనె సంచులు, రవాణా వాహనాలు వంటివి అందుబాటులో ఉండటం లేదు. ఇవి మేజర్ సమస్యలుగా ఉంటున్నాయి. వీటిపై తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తలోదారి!

(5వ పేజీ తరువాయి)

ప్రజలంతా కూడా దాదాపుగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి భిన్నంగా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీకి ఎన్టీఆర్ జిల్లాలో కలపటానికి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆయన కమిటీకి పదేపదే చెబుతుండటంతో పెనమలూరు అంశంపై గందరగోళం తలెత్తుతోంది. పెనమలూరు ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యవహరించడం నియోజకవర్గంలో విస్తృత చర్చకు దారితీస్తోంది. ఆయన ఏ కారణం చేత వద్దంటున్నారో నియోజకవర్గ ప్రజలకు అంతుచిక్కటం లేదు. నియోజకవర్గ ప్రజలు మాత్రం అగ్గిమీదగుగ్గిలం అవుతున్నారని తెలిసింది. ఎమ్మెల్యే తీరుపై మీడియాకు ఫిర్యాదులు చేస్తున్నారు. సోషల్ మీడియాలో వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంతో నియోజకవర్గంలో ఇప్పటి వరకు చాపకిందనీరులా జరుగుతున్న ఇతర వ్యవహారాలన్నీ తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. మొత్తం మీద ఈ వ్యవహారం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే విధంగా తయారైందని సమాచారం.

సబ్ కమిటీ సమావేశంలో చర్చ

సోమవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పెనమలూరు నియోజకవర్గం అంశం చర్చకు వచ్చింది. నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న ఒత్తిడి వస్తోందన్న అంశాన్ని ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. విజయవాడను ఆనుకుని ఉండే పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపకుండా నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలను కలిపితే ఎలా అన్న అంశం కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. విజయవాడకు దగ్గరగా ఉన్న నియోజకవర్గాల విషయంలో.. నియోజకవర్గాల పునర్విభజన సమయంలో నిర్ణయం తీసుకుందామని సీఎం చంద్రబాబు అన్నట్టు సమాచారం.

ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా యార్లగడ్డ అడుగులు

విజయవాడకు సమీపంలో ఉండటం.. విజయవాడ విమానాశ్రయాన్ని కలిగి ఉన్న గన్నవరం నియోజకవర్గాన్ని కూడా విజయవాడలో కలపాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అక్కడ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. కేబినెట్ సబ్ కమిటీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని చెబుతున్నారు. విజయవాడ రూరల్ మండలం ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఉంది. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు మాత్రం కృష్ణాజిల్లాలో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఒక నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్‌తో పాటు, ఒకే జిల్లాలో ఉండాలన్నది నిర్దేశిస్తోంది. ఈ లెక్కన చూస్తే గన్నవరం నియోజకవర్గాన్ని అక్కడి ప్రజలు, స్థానిక ఎమ్మెల్యే కూడా సమ్మతం తెలపటంతో ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకురావటం అన్నది సహేతుకంగా కనిపిస్తోంది.

తెరపైకి మరో వాదన

గన్నవరం నియోజకవర్గం, పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే కృష్ణాజిల్లా చిన్నదైపోతుందని మంత్రి కొల్లు రవీంద్ర సరికొత్త వాదనలు తీసుకువస్తున్నారని తెలుస్తోంది. ఈ వాదనతో అంతా గందరగోళానికి దారితీస్తోంది. కృష్ణాజిల్లాలోకి అతిపెద్ద కైకలూరు నియోజవర్గం వచ్చి కలవనుంది. ఇలాంటపుడు కృష్ణాజిల్లా ఎందుకు చిన్నదవుతుందో మంత్రికే తెలియాలి.

హద్దుమీరిన పెత్తనం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చే వరకు ఈ పనులను నిలిపివేస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఈ నెల 21వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మాకు తెలియకుండానే అభివృద్ధి పనులు ఆపేస్తారా అంటూ జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త తనదైన శైలిలో ఉద్యోగులపై తిట్లదండకం అందుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంతో జెడ్పీ అధికారులు, జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త మధ్య విభేదాలు ముదిరిపాకాన పడ్డాయి.

మహిళా ఉద్యోగిపై శివాలు!

జిల్లా పరిషత్ ప్లానింగ్ విభాగం సూపరింటెండెంట్‌గా మహిళా అధికారి పనిచేస్తున్నారు. జెడ్పీ నిధులతో పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చినట్లే ఇచ్చి నిధుల కొరతతో వాటిని నిలిపివేయడంతో జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త సంబంధిత విభాగం సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి పరుష పదజాలంతో విరుచుకుపడినట్లు తెలిసింది. ఈ విషయమై సదరు అధికారి తోటి ఉద్యోగులకు చెప్పుకుని బాధపడటంతో.. వారంతా కలిసి జెడ్పీ డిప్యూటీ సీఈవో వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పినట్టు సమాచారం. ప్లానింగ్ విభాగం సూపరింటెండెంట్ కంటే ముందే తనకు సదరు వ్యక్తి నుంచి ఫోన్ వచ్చిందని, తాను ఆమెలాంటి బాధితుడినేనని జెడ్పీ డిప్యూటీ సీఈవో చెప్పడంతో ఉద్యోగులు ఖంగుతిన్నట్లు తెలిసింది. అనంతరం ఉద్యోగులంతా జెడ్పీ సీఈవో వద్దకు వెళ్లి జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త తీరుపై ఫిర్యాదు చేశారు. జెడ్పీ ఛైర్‌పర్సన్‌తో తాను మాట్లాడుతానని, అప్పటి వరకు వేచి ఉండాలని జెడ్పీ సీఈవో ఉద్యోగులకు చెప్పి పంపేశారు.

సమావేశమైన ఉద్యోగులు

జెడ్పీలో ఛైర్‌పర్సన్ భర్త పెత్తనం పెరిగిపోవడం, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతున్న తీరుపై ఏం చేయాలనే అంశంపై జెడ్పీ ఉద్యోగులంతా సమావేశమై చర్చించుకున్నారు. ఉద్యోగులు పరిపాలనాపరంగా ఏదైనా పొరపాటు చేస్తే జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉద్యోగులను తన చాంబరుకు పిలిపించి మాట్లాడవచ్చునని, కానీ జెడ్పీలో ఎలాంటి పదవి లేని జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త ప్రభుత్వ ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నాడని, ఇలాంటి ఘటనలు జరగడం ఇదే తొలిసారి కాదని, గతంలోనూ ఇదే తరహాలో ఆయన వ్యవహరించాడని ఉద్యోగులు మాట్లాడుకున్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ భర్త వైఖరిపై కలెక్టర్, ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయాలని, ఈ విషయంలో అందరం ఐక్యంగా ఉండాలని జెడ్పీలో పనిచేసే ఉద్యోగులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



విజేత కృష్ణాజిల్లా బాలికల జట్టుతో కొనకళ్ల బుల్లయ్య తదితరులు

కబడ్డీ విజేతలు కృష్ణా, కర్నూలు జట్లు

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నోబుల్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్ 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి గెలుచుకోగా.. శ్రీకాకుళం జట్టు ద్వితీయ, ప్రకాశం జట్టు తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. బాలికల పోటీల్లో కృష్ణాజిల్లా విన్నర్స్‌గా నిలిచింది. శ్రీకాకుళం జట్టు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం బీచ్ కబడ్డీ, ఆ తరువాత బీచ్ ఫెస్టివల్‌లో మంత్రి రవీంద్ర జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించారన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ, డీవైఈవో సింగ్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, జనసేన నేత మాదివాడ రాము, కృష్ణాజిల్లా పీఈటీల సంఘం అధ్యక్షురాలు కె.మనీలామణి, సంఘ ప్రధాన కార్యదర్శి సింహాద్రి గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాంబాబు, సీహెచ్ రాజేష్, ఎం.అరుణ, పరిశీలకుడు అడపా రామకృష్ణ తదితరులు మాట్లాడారు. కాగా రాష్ట్రస్థాయి బాలుర పోటీలకు 16, బాలికల పోటీలకు 16 మందిని ఎంపిక చేశారు.

ప్రతీ రైతు ఒక శాస్త్రవేత్త కావాలి

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యతనిస్తున్నారని, ఆ దిశగా రైతులు అడుగులు వేయాలని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద 46,86,838 మంది రైతులకు రూ.6,310 కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రతీ గింజను కొనుగోలు చేసి 24 గంటల్లోపే ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు.

రైతాంగ సమస్యలపై చర్చించేందుకు జగన్ అసెంబ్లీకి రావాలి

రైతాంగ సమస్యలను చర్చించేందుకు జగన్ అసెంబ్లీకి రావాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. టీవీల ముందు కూర్చుని, తన సొంత పత్రికల్లో ఇష్టమొచ్చినట్లు రాయటం తగదన్నారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే సమస్యలపై చర్చించేందుకు మేము ఎక్కడికైనా వస్తామని తెలిపారు. మీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. ఘంటసాలలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని, దివిసీమలో ఉన్న మత్స్యపాలిటెక్నిక్ కాలేజీని కళాశాలగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర వ్యవసాయ శాఖస్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనాజిర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, పశుసంవర్ధశాఖ జేడీ నరసింహులు, కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, గ్రామ సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మైనింగ్!

(5వ పేజీ తరువాయి)

దాని పక్కనే అనుమతులు ఇచ్చే విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారా ? సరిహద్దులు నిర్ణయించారా ? అని జేసీ ప్రశ్నించే సరికి గనుల శాఖ అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. అక్రమ తవ్వకాలు ఎక్కడా జరగటం లేదని, చెక్‌పోస్టుల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందని సమాధానం ఇచ్చారు. చెక్‌పోస్టులు అనేవి కేవలం బిల్లులు ఉన్నాయా లేదా అన్నవి చూస్తున్నారే తప్ప.. అది అక్రమమా, సక్రమమా అనేది గుర్తించలేవని గట్టిగా స్థానికులు వాదించారు. దీంతో జేసీ గనుల శాఖ అధికారులను అనుమతులు ఇచ్చిన వాటికి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

రికవరీల సంగతేంటీ?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి, వేమవరం, జక్కంపూడి, నైనవరం, అప్పారావుపేట, పాతపాడు గ్రామాలతో పాటు జి.కొండూరు మండలం పరిధిలోని వెలగలేరు, చెగిరెడ్డిపాడు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో కోట్లాది రూపాయల మేర అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇవే కాకుండా పేదల అసైన్డ్ భూములు, పోలవరం కుడి కాలువ గట్టు మట్టి, కొండవారు (ప్రభుత్వ భూమి) భూములలో భారీ ఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయి. వీటిపై అనేక ఫిర్యాదులు అధికారులకు అందాయి. పదే పదే ఫిర్యాదులు వస్తుండటంతో అప్పట్లో మొక్కుబడిగా కొన్ని ఫిర్యాదులపై మాత్రమే అప్పటి జిల్లా అధికారులు స్పందించారు. కొన్నింటిపైనే విచారణ జరిపారు. అక్రమంగా తవ్విన వాటిని పరిశీలించగా, ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున నష్టాన్ని కలిగించారని తేలింది. కొత్తూరు తాడేపల్లి పరిధిలో రూ.57.86 కోట్లు, వేమవరంలో రూ. 31కోట్లు, పి.నైనవరంలో 14.47 కోట్లు, వెలగలేరులో రూ.31.91 కోట్లు చొప్పున తవ్వకాలు సాగించారని గుర్తించారు. ఇవన్నీ కలిపితే రూ.135.18 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండి పడిందని నిర్ధారించారు. ఇవే కాకుండా పోలవరం కుడికాలువ, విజయవాడ డివిజన్ - 5 పరిధిలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. వీటి విలువ కూడా వందల కోట్ల రూపాయలలో ఉంటుందని అంచనా. ఇప్పటి వరకు పైసా కూడా ప్రభుత్వానికి చెల్లింపులు జరగలేదు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి, మల్లికా ర్జునస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన దాత విరాళం అందజేశారు. అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.30 లక్షలు, మల్లికా ర్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10, 116 విరాళాన్ని అభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మొవ్వా కృష్ణప్రసాద్, ప్రీతి దంపతులు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. మొవ్వా ధర్మారావు, భారతి, గూడపాటి రత్నశేఖర్ దంపతులు పాల్గొన్నారు.

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే కంటి చూపునకు ప్రమాదం

పెనమలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధిగ్రస్తులు సకాలంలో మధుమేహ పరీక్షలు చేయించుకోకుండా అశ్రద్ధ వహిస్తే డయాబెటిక్ రెటినోపతి కారణంగా కంటి చూపును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఆదిత్య కపూర్ హెచ్చరించారు. ఆసుపత్రి ఆవరణలో సోమవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ డయాబెటిక్ నిర్ధారణ అయిన ఐదేళ్ల తర్వాత సమగ్ర కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.



చినఓగిరాల పీహెచ్‌సీ పరిసరాలు పరిశీలిస్తున్న ప్రేమ్‌చంద్

పిల్లలందరికీ టీకాలు వేయించాలి

ఉయ్యూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండున్నర సంవత్సరాల లోపు పిల్లలందరికి టీకాలు తప్పక యాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్‌చంద్ అన్నారు. చినఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిష్టర్ తనిఖీ చేశారు. గర్భిణులకు టీడీ ఇంజక్షన్లు తప్పక వేయాలన్నారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలను డాక్టర్ ఎన్. తేజస్విని తెలియజేశారు. ఇమ్యునైజేషన్ వివరాలను ఎంపీ హెచ్‌ఈఓ పి.నాగరాజు వివరించారు.



పరిశుభ్రతపై అవగాహన

కానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ మహిళా సంక్షేమ కమిటీ, యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం తాడిగడప జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఏవిధంగా శుభ్రంగా ఉండాలి, శారీరక, మానసిక ఆరోగ్యం, అపోహలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మాధవి, సుజాత, గీత, సుమలత, జ్యోతి, నరేంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎనికేపాడు విద్యుత్ ఉప కేంద్రంలోని 11కేవీ పల్లవి ఫీడర్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు ఎనికేపాడు హరిజనవాడ, జెండా చెట్టు సెంటర్, విజయ ఆగ్రోకట్ట, రైలు కట్ట, జామతోట ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని ఏఈ పరమేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నున్న జడ్పీ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు

విజయవాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'బాలలపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై సోమవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. సోషల్ మీడియా కారణంగా జరిగే లాభనష్టాలను వివరిస్తూ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎం. దేవమణి మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రజల జీవితాల్లో అంతర్భాగంగా మారిపోయిందని వారి మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత సంబంధాలను దెబ్బతీస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రవిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకు మానవత చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు చేయూత నివ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిచడం అభినందనీయమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. హనుమాన్‌జంక్షన్ మానవత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీకే నారాయణ అందించిన విరాళాన్ని ఆదిత్య బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణకు అందజేశారు. విశ్రాంత సర్వేయర్ నారాయణ తన ముని మనుమరాలు రాధారాణి మొదటి పుట్టినరోజు సందర్భంగా విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నరసింహారావు, రాజేశ్వరరావు, వీవీఎస్ చలం, గణేష్, వేగిరెడ్డి సూర్యనారాయణ, తదితర సభ్యులు పాల్గొన్నారు.





వీరవల్లిలో రైతన్నా-మీకోసంలో నాయకులు.. రంగన్నగూడెంలో.. పెదపులిపాకలో

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఏఎంసీ చైర్మన్ జి. నరసింహారావు



ముస్తాబాదలో రైతన్న -మీకోసం అవగాహన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరసింహారావు, తులసీమోహన్

గన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల జీవనోపాధి ఆర్థిక స్థితి నైపుణ్య అభివృద్ధితో రైతుల్లో శాశ్వత మార్పులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు అన్నారు. మండలంలోని ముస్తాబాదలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో సమూల మార్పులు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగానే పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి తులసిమోహన్, మేడేపల్లి రమా, ఎంపీడీవో టి.స్వర్ణలత, వెటర్నరీ డాక్టర్ మేరీ వైడూర్యం, పాలడుగు మల్లికార్జునరావు, కానూరు శేషు మాధవి, దొంతు చిన్న, బోడపాటి రవి, కడియాల రాజశేఖర్, పాలడుగు రత్నారావు, కొమ్మినేని కృష్ణారావు, పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేలేరు, రంగన్నగూడెం, వీరవల్లి, పెరికీడులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా పంచసూత్రాలపై రైతన్నా.. మీకోసం ద్వారా అవగాహన కలిగించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. వేలేరు, రంగన్నగూడెం, వీరవల్లి, పెరికీడు తదితర గ్రామాల్లో సోమవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో రైతులను కలిసి మాట్లాడారు. రంగన్నగూడెంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, కనకవల్లి శేషగిరిరావు, పుసులూరి లక్ష్మీనారాయణ, పలగాని వీరాంజనేయులు, కొలుసు గంగాజలం, ఆలపాటి రాంబాబు తదితర రైతులు పాల్గొన్నారు. వీరవల్లిలో కలపాల నాని, లంక అజయ్‌కుమార్, మండాది రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వేలేరులో అవిర్నేని భవానీ శంకర్, కాజ సురేష్, రైతులు పాల్గొన్నారు. పెరికీడులో వేగిరెడ్డి పాపారావు, ఆంజనేయులు, ప్రవీణ్, సూర్యావతి తదితర నాయకులతో పాటు రైతులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో ..

పెనమలూరు: మండలంలోని పెదపులిపాకలో సోమవారం మండల వ్యవసాయాధికారులు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం గురించి అధికారులు రైతులకు వివరించారు. గన్నవరం డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఎం సునీల్ మాట్లాడుతూ, తాడిగడప గ్రామంలో కల్లాల్లోని ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాబట్టి రైతులు 17శాతం తేమ శాతం వచ్చేట్లు ఆరబెట్టుకొని ప్రభుత్వానికే తమ ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు జెండర్ అరుణ, శ్రీకర్, ఏవో శైలజ, కూటమి నేతలు వల్లూరు శ్రీమన్నారాయణ, దాసరి హరినీడు, మునునూరు శ్రీనివాసరావు, శ్రీధర్, పండల రజిని తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పల అన్నసమారాధనలో చలసాని నాగమణి ఫౌండేషన్ చైర్మన్ చలసాని అరుణ్ ప్రసాద్

నిత్యాన్నదాన (సద్ది)కి విశేష స్పందన

కంకిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చలసాని నాగమణి ఫౌండేషన్ (అమ్మాజి చారిటబుల్ ట్రస్టు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదా(సద్ది)కి మంచి స్పందన లభిస్తుందని ట్రస్టు చైర్మన్ చలసాని అరుణ్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా అరుణ్ ప్రసాద్ మాట్లాడుతూ, మండలంలోని నెప్పల్లి శివాలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి అయ్యప్ప మాల దారులకు అమ్మాజి చారిటబుల్ ట్రస్టు, దాతల సహకారంతో నిత్యాన్నదాన (సద్ది) కార్యక్రమం నిర్వ హిస్తున్నామన్నారు. సుమారు 150 మంది అయ్యప్ప మాలదారులు ఈ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవడం ఆనందంగా ఉందని తెలియజేశారు. 24వ తేదీన అన్నదానానికి సహకరించిన చలసాని నాగ సురేష్‌ను ఆయన అభినందించారు.



వాకర్ సురేశ్‌బాబును సన్మానిస్తున్న సభ్యులు

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

నడకలో వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సురేశ్‌బాబుకు ఘన సన్మానం

కానూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): నడకతోనే సంపూర్ణ ఆరోగ్యమని కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణం వాకర్స్ సభ్యులు అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర నడకలో వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న ప్రముఖ వాకర్ బండి సురేశ్‌బాబును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు మాట్లాడుతూ, పులిపాకకు చెందిన బండి సురేశ్‌బాబు (72) సంవత్సరాల వయస్సులో నడకతోనే ఆరోగమని నమ్మి, 2023 మార్చి ఒకటి నుంచి మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ప్రముఖుల సమక్షంలో నడక ప్రారంభించి, నిరంతర నడక కొనసాగించి, ప్రతి రోజు పదివేల అడుగుల చొప్పున నడుస్తూ, వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. నడకతో పాటు సిద్ధార్థ వాకర్స్‌కు నిత్యం యోగా నేర్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిస్తున్నారన్నారు. నిరంతర కృషి పట్టుదలతో ఈఘనత సాధించారన్నారు. సురేశ్‌బాబును సన్మానించిన వారిలో హరిబాబు, వెంకటరెడ్డి, రత్నప్రసాద్, యనమదల జ్యోతిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జనసేన నాయకులు ముప్పా రాజా

బాధిత కుటుంబానికి అండగా జనసేన

కంకిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు ముప్పా రాజా అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన జనసైనికుడు శింగంశెట్టి గణేష్ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును సోమవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిన నాగరాజు, సుంకర సురేష్, తంబళ్ల వీరాస్వామి, గుడివాడ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రహణం మొర్రిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గ్రహణం మొర్రి ఆపరేషన్లు ప్రారంభం

గన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రహణం మొర్రి చిన్న తనంలోనే చికిత్స చేస్తే మంచి ఫలితం వస్తుందని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాలలో ఆపరేషన్ స్మైల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకూ జరిగే ఉచితంగా గ్రహణం మొర్రి ఆపరేషన్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు గ్రహణం మొర్రి, అంగిలి చీలిక, చీలి పెదవితో బాధపడుతున్న వారికి ఆపరేషన్ స్మైల్ ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. చిన్న, పెద్ద వారికి వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, ఏవో కె.నవీన్, ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవాని మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమామహేశ్వరపురం వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తి గాయాలపాలయ్యాడు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకుకు చెందిన కుక్కనూరి జైరామ్(33) విజయవాడ దుర్గగుడిలో దర్శనం చేసుకుని ద్విచక్రవాహనంపై తిరిగి తణుకు వెళుతున్న క్రమంలో ఉమామహేశ్వరపురం వద్ద జాతీయ రహదారిపై మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జైరామ్ అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న ఆలాబాని సాయితేజకు గాయాలయ్యాయని వివరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్కూరు ఎస్సై మూర్తి తెలిపారు.

స్తంభించిన డ్రైయినేజీ వ్యవస్థ

- రోడ్డుపై చేరిన మురుగునీటితో ప్రజల అవస్థలు
- వాట్సాప్ గ్రూపులో కథనంతో కదిలిన పంచాయతీ అధికారులు

ఉంగుటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మేజర్ పంచాయతీ అయిన పెదఅవుటపల్లిలో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గ్రామంలో కీలకమైన బాబు హోటల్ పక్కన వున్న రోడ్డు (జోసఫ్‌తంబి గుడి వెనుకరోడ్డు) పరిస్థితి అత్యంత దారుణంగా వుంది. సరైన డ్రెయినేజీ లేకపోవడం, మురుగునీరంతా రోడ్డుపై నిలిచి బురదకూపంగా మారటంతో ఈ రోడ్డు మీదుగా ప్రతి శని, ఆదివారాల్లో తంబి గుడికి రాకపోకలు సాగించే స్థానిక భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు బురదను దాటుకుంటూ వెళ్లలేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యపై పంచాయతీ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ఈరోడ్డు దుస్థితిపై స్థానిక యువత సోమవారం వాట్సాప్‌గ్రూపుల్లో వార్త షేర్ చేయడంతో స్పందించిన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి జె.యోహాను రోడ్డు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి డ్రెయినేజీ ప్రక్షాళనకు తక్షణ చర్యలు చేపట్టారు.



రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

ప్రసాదంపాడు అభివృద్ధికి రూ. 2.5 కోట్లు

ప్రసాదంపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రసాదంపాడులో రహదారుల అభివృద్ధికి రూ.1.50 కోట్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సుమారుగా రూ. కోటి ఖర్చు చేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్ నిధుల నుంచి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడికున్నాయని యుద్ధప్రాతిపదికన పూడిక పనులు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడిగా బత్తుల



బత్తుల చిన్నారావుకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్వో భాస్కర్ గణేష్

ప్రసాదంపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడిగా బత్తుల చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా కార్య దర్శి, విజయవాడ రూరల్ మండల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సింగవరపు భాస్కర్ గణేష్ ప్రకటించారు. సోమవారం ప్రసాదంపాడులో బీజేపీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ అంగడాల సతీష్ ఆధ్వర్యంలో పార్టీ రూరల్ మండల అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు మట్టా యూన్సీ, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి యర్రింకి నాగశ్రీనివాస్ నాయుడు, మండలంలోని బూత్ అధ్యక్షులు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ- డ్రైవర్‌కు గాయాలు



గన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లారీ యూటర్న్ తీసుకునే క్రమంలో వెనక్కి రివర్స్ వస్తూ ట్రావెల్ బస్సును ఢీకొనడంతో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటన మండలంలోని చిన అవుటపల్లి వేబ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారు ఝామున జరిగింది. ఆత్కూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎస్‌వికే ట్రావెల్ బస్సును శ్రీకాకుళం దగ్గర పొందూరు పెళ్లికి వెళ్లింది. తిరిగి 17 మందితో వస్తుంది. ఈ క్రమంలో చిన అవుటపల్లి సమీపంలో ఉన్న కటింగ్ దగ్గర లారీ యూటర్న్ తీసుకుం టుంది. యూటర్న్ తీసుకునే క్రమంలో వెనక్కి రాగా ట్రావెల్ బస్సును ఢీకొంది. బస్సు డ్రైవర్ కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. బస్సులో ఉన్నవారికి స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెజవాడలో క్రిస్మస్ ఫీవర్







● విజయవాడలో కేక్ మిక్సింగ్‌ల హడావిడి ● యూరప్ నుంచి వచ్చిన కేక్ మిక్సింగ్ కల్చర్
● హోటళ్లు, ఇళ్లలో మొదలైన వేడుకలు ● మనుషులంతా ఒక్కటేనని సంకేతం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: క్రిస్మస్ ఫీవర్ ఆరంభమైంది! క్రిస్మస్ ఆగమనాన్ని దృష్టిలో పెట్టుకుని బెజవాడలో కేక్ మిక్సింగ్ సందడి మొదలైంది! స్టార్ హోటళ్లలో ఇప్పటికే కేక్ మిక్సింగ్ వేడుకలు జరుగుతుండగా నగరంలో వివిధ సంస్థలు, క్రైస్తవ సోదరుల ఇళ్లల్లోనూ కేక్ మిక్సింగ్‌లు జరుగుతున్నాయి. క్రిస్మస్ స్పెషల్ కేక్ కోసం మెటీరియల్స్‌ను కొనుగోలు చేసి మిక్స్ చేస్తారు. నెలరోజుల పాటు నిల్వ ఉంచి క్రిస్మస్ రోజున కేకును కట్ చేసి బంధువులు, ఆత్మీయులు, స్నేహితులకు పంచుతారు. ఈ ట్రెండ్ ఇప్పుడు బెజవాడలో క్రిస్మస్ ఫీవర్‌కు ఊపు తెస్తోంది.

వారం రోజులుగా స్టార్ హోటళ్ల నుంచి చిన్నచిన్న హోటళ్ల వరకు వారి వారి సంఘాలతో కలిసి ఈ వేడులను సందడిగా నిర్వహిస్తున్నాయి. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులైన యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చిన్న చిన్న హోటళ్లతో పాటు కొందరు తమ ఇళ్లలోనూ, సంఘాల్లోనూ ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. క్రిస్మస్ పండుగ దగ్గర పడుతున్న తరుణంలో కేక్ మిక్సింగ్ వేడుకలు ప్రస్తుతం అత్యధికంగా సాగుతున్నాయి. మనుషులందరూ ఒక్కటేనని సంకేతమిస్తూ ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ ఆప్యాయతలను చూపాలనే సంకేతాలను ఈ ఉత్సవం ద్వారా ఇస్తున్నారు.

17వ శతాబ్దంలో ఈ ఆచారం యూరప్‌లో ప్రారంభమైనట్టు చరిత్ర చెబుతోంది. రైతులు పంటకోత పనులు పూర్తిచేసిన తరువాత క్రిస్మస్‌కి 40 రోజుల ముందు కేక్ మిక్సింగ్‌ను నిర్వహించేవారు. రైతులందరూ కలిసి తాము పండించిన కిలోల కొద్దీ డ్రై ఫ్రూట్స్, నట్స్, డ్రెయిన్స్, స్పైసెస్‌ను కలిపి, ఈ మిశ్రమానికి ఆల్కహాల్‌ను కలుపుతారు. గ్రామాల్లోని రైతులందరూ సమూహంగా ఈ ఉత్సవాన్ని జరుపుకుంటారు. రైతు కుటుంబాల సమూహాలు పంట దిగుబడులకు ప్రతీకగా కేక్‌మిక్సింగ్ చేస్తారు. తారతమ్యాలకు తావివ్వకుండా ఐక్యంగా అందరూ కలిసి వారు పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ ప్రేమతో కేక్‌ను చేతులతో కలుపుతారు. ఈ మిశ్రమాన్ని క్రిస్మస్ వరకు నిల్వ చేస్తారు. పండుగ రోజు దాన్ని తీసి అందరికీ పంచుతూ ఐక్యతను చాటడం కేక్ మిక్సింగ్ ప్రత్యేకత. యూరప్‌లో ప్రారంభమైన ఈ ఆచారం క్రమక్రమంగా ప్రపంచమంతా విస్తరించింది. చాలాదేశాల్లో ఇదే ఆచారాన్ని నిర్వహిస్తున్నారు.

పట్టాభి స్మారక భవనం నిర్మించి తీరుతాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు పెట్టినా స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మించి తీరుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ సెంటర్‌లోని పట్టాభి సీతారామయ్య విగ్రహానికి సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజరు రామారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ పీవీ ఫణికుమార్, టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి యూనియన్ బ్యాంకు కోట్లాది రూపాయలు ఇస్తామన్నప్పటికీ భవన నిర్మాణానికి మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు అడ్డుతగులుతున్నారన్నారు. నగర ప్రజలు ఇది గమనిస్తున్నారన్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయకుండా చరిత్రహీనులవుతున్నారన్నారు. ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంకును స్థాపించి వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఆయన స్థాపించిన కేడీసీసీ బ్యాంకు రైతులను ఆదుకుంటోందన్నారు. టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ సీతారామయ్య జన్మించింది గుండుగొలనులోనైనా మచిలీపట్నం నేతగా రాణించారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ పీవీ ఫణికుమార్ మాట్లాడుతూ తాను సీతారామయ్య స్మారక భవనం కోసం హైకోర్టుకు వెళ్లానని, కోర్టు భవన నిర్మాణానికి అనుకూలంగా తీర్పుఇచ్చినా మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసేందుకు ముందుకు రాక పోవడం దురదృష్టకరమన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జనసేన నగరాధ్యక్షుడు గడ్డం రాజు, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, లంకే నారాయణ ప్రసాద్, సింగరాజు గోవర్ధన్, మోపర్తి సుబ్రహ్మణ్యం, వీవీఎస్ఆర్ శర్మ, సేతురామయ్య పాల్గొన్నారు.



పట్టాభి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర



కృష్ణానదికి చీర సమర్పణలో భక్తులు, నదీ తీరాన చీర సమర్పణను వీక్షిస్తున్న భక్తులు

కృష్ణవేణమ్మకు మహాచీర

నాగాయలంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మకు మహాచీరను కట్టుగా, భక్తులు, ప్రజలు మైమరిచిపోయారు. సోమవారం నాగాయలంక శ్రీరామపాదక్షేత్ర పుష్కరఘాట్ నుంచి బాపట్ల జిల్లా బొబ్బర్లంక వరకు 2 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన కృష్ణమ్మకు భక్తులిచ్చిన 504 రకాల చీరలతో ముడులు వేసిన మహావస్త్రాన్ని పడవలపై తీసుకెళ్లి సమర్పించారు. తొలుత శ్రీరామపాదక్షేత్రంలోని కృష్ణమ్మకు ముత్తైదువులు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమలు, నదీ హారతి ఇచ్చి పండితుల వేదమంత్రాలతో, కృష్ణమ్మ తల్లికి జై అంటూ సమర్పించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మహారాష్ట్రలో పుట్టిన కృష్ణమ్మ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టి 5 కోట్ల ప్రజలకు ఆహార పంటలను పండిస్తూ తాగునీటిని అందిస్తూ, మత్స్యసంపదకు నెలవుగా మారిన నేపథ్యంలో ఈ మహావస్త్రాన్ని కృష్ణమ్మకు కృతజ్ఞతగా సమర్పించారు. తొలుత నాగాయలంక కూడలి నుంచి వేదమంత్రాలు, మేళతాళాల మధ్య మహావస్త్రాన్ని ఊరేగింపుగా పట్టుకొని భక్తులు, విద్యార్థులు, ప్రజలు తీసుకెళ్లి కృష్ణమ్మకు సమర్పించారు. శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని కృష్ణమ్మకు బాపట్ల జిల్లాలోని కృష్ణమ్మ ప్రవాహంపై పరుచుకుంటూ వెళ్లి కప్పి సమర్పించారు. తరగలపై కప్పి మహాచీరను చూసుకుంటూ కృష్ణవేణమ్మ మహదానందం పొందింది. భక్తులు, ప్రజలు విరివిగా తరలివచ్చారు. దీంతో పుష్కరఘాట్ కోలాహలంగా మారింది. కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్, మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్, తలశిల రఘుశేఖర్, దుట్టా ఉమామహేశ్వరరావు, చిట్టా వాణి, స్వాములు, ధర్మకర్తలు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసంలో వివిధ సమస్యలపై ప్రజలిచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోవడంతో మళ్లీ అవే దరఖాస్తులు వస్తున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందినట్టు సంతకాలు తీసుకోవడంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ విభాగాల్లో పెండింగ్‌లోని అర్జీలను వివరించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మీకోసంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగులు, వృద్ధుల వద్దకు కలెక్టర్ వెళ్లి వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరరావు, డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, సర్వశిక్షవిభాగం ఏడీ కుముదినిసింగ్, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్‌రాజా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరిస్తాం : ఎస్పీ



ప్రజలిచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా, చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం ఎస్పీ మీ కోసంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. స్నేహితుడితో కలిసి వ్యాపారం ప్రారంభించానని, వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయని చూపి మోసం చేశారని, అంతేకాక తన వాళ్లతో కలిసి కొట్టి చంపాలని ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని తాడిగడప నుంచి పృథ్వీ అనే వ్యక్తి కోరాడు. నాలుగేళ్ల క్రితం వివాహమైందని, పిల్లలు పుట్టలేదనే కారణంతో అత్తింటి వారు వేధిస్తున్నారని పామర్రు నుంచి వచ్చిన వనజ ఫిర్యాదు చేశారు. అలాగే తన భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిందని, కుమారులిద్దరూ ఆస్తి రాయాలని వేధిస్తున్నారని అవనిగడ్డ నుంచి వచ్చిన వీరయ్య ఫిర్యాదు చేశారు.



మృతి చెందిన జన సైనికుడి కుటుంబానికి చెక్కు ఇస్తున్న నాగబాబు

మృతి చెందిన జనసైనికుడి కుటుంబానికి ఆర్థికసాయం

గుడ్లవల్లేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత్వం ఉండి ప్రమాదంలో మృతి చెందిన జనసైనికులకు పార్టీ తరపున ఇస్తున్న బీమా నిధిని మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. కాగా ఇటీవల చినగొన్నూరు గ్రామానికి చెందిన కోటప్రోలు శివ,సీత ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణిదల నాగబాబు రూ.10లక్షల చెక్కును అందజేశారు. కార్యకర్తలకు ఎన్నడూ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పేర్ని జగన్ అన్నారు. గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ టీడీపీ రాష్ట్ర నేతలు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సాయిన పుష్పావతి, ఎస్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారిణులు, అసోసియేషన్ సభ్యులతో శాప్ చైర్మన్

మహిళలు రాణించేందుకు అస్మిత ఖేలో ఇండియా పోటీలు దోహదం

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్రీడారంగంలో రాణించేందుకు అస్మిత ఖేలో ఇండియా పోటీలు ఎంతో దోహదపడతాయని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో సోమవారం నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ లీగ్ ద్వారా మహిళల్లో క్రీడలపై పెరుగుతుందని, గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వేదికగా మారుతుందన్నారు. స్పోర్ట్స్ పాలసీని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారిణులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. శాప్ బోర్డు సభ్యులు ఎస్ సంతోష్ కుమార్, కే కోటేశ్వరరావు, సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ డీ నవీన్ కుమార్, డీ సుధీర్, నీలిమ పాల్గొన్నారు.

డిసెంబరులో పారాషటిల్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 1, 2న గుంటూరులోని క్రీడా అభివృద్ధి సంస్థలో రాష్ట్రస్థాయి పారాషటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు శాప్ అధికారులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించి ఈనెల 27లోపు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను పంపాలని ఆదేశించారనానరు. ఈ పోటీలు అండర్-17 సబ్ జూనియర్, అండర్-20 జూనియర్, ఓపెన్ కేటగిరి సీనియర్, డబ్ల్యూ 1,2 వీల్‌చైర్ యుజర్స్, ఎస్ఎల్ 3,4 లోయర్ లింబ్ ఇంపైర్‌మెంట్స్, ఎస్‌యు5 అప్పర్ లింబ్ ఇంపైర్‌మెంట్స్, ఎస్ఎస్6 షార్టు స్టార్చురీ, సింగల్, డబుల్, మిక్స్‌డ్ డబుల్స్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీలు రాష్ట్రస్థాయి పారా క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించి, వారికి ప్రోత్సాహం కల్పించడం, వారి ప్రతిభను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే ప్రధాన ఉద్దేశమని శాప్ అధికారులు తెలిపారు.

ఏకగ్రీవంగా ముగ్గురు సభ్యుల ఎన్నిక

బెంజ్‌సర్కిల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచవల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ విజయవాడ పాలకవర్గంలోని చైర్మన్‌గా కోనేరు వెంకట రామారావు, వైస్ చైర్మన్‌గా గోపిశెట్టి వీరవెంకయ్య, సెక్రటరీగా కొల్లి రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రధాన ఎన్నికల అధికారి పాలడుగు వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఐదేళ్లు వ్యవసాయాన్ని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

● గాడిన పెడుతున్న కూటమి ప్రభుత్వం : టీడీపీ నేత ఉమా

విజయవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు వ్యవసాయాన్ని గాలికొదిలేసి, రైతన్నను రోడ్డున పడేసిందని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతన్నా మీ కోసం'లో భాగంగా గొల్లపూడిలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అస్తవ్యస్తం కల్పించేలా కరపత్రాల పంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం రైతులకు అవగాహన కల్పించి, పంచసూత్రాల అమలుకు మార్గదర్శకత్వం అందించడానికి కీలక అడుగన్నారు. ప్రతిరైతు సేవాకేంద్రంలో కార్యాచరణ ప్రణాళికను అమలుచేయడం, రైతులను ప్రకృతి వ్యవసాయ వైపు మళ్లించేలా శిక్షణలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తేమశాతం వంటి సీసీఐ నిబంధనల కారణంగా పత్తి రైతులు నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారన్నారు. రైతు పండించే పంట ఏదైనా మద్దతు ధర దక్కేలా ప్రభుత్వ పర్యవేక్షిస్తోందన్నారు. దళారులు చేతిలో రైతులు మోసపోవద్దని, వారికి పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీవోఎంగా సురేష్ రెడ్డి



రైల్వేస్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (సీనియర్ డీవోఎం)గా ఏ సురేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన సికింద్రాబాద్ సీనియర్ డీవోఎంగా పనిచేశారు. రైళ్ల నిర్వహణలో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. రక్షణ, ప్లానింగ్, పరిపాలనలో ఆయన నాయకత్వం బహుముఖంగా ప్రశంసలు పొందింది. తొలుత ఆయన సనత్‌నగర్‌లో ఏరియా ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అన్ని విభాగాల్లో ఆయన ప్రతిభను నిరూపించారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి ప్రతిభకు అవార్డులు పొందారు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అవార్డు పొందారు. వృత్తిపట్ల ఆయన అంకితభావాన్ని అవార్డులు తెలియజేస్తున్నాయి. కాగా, ఎన్టీఆర్ యూనివర్శిటీ పరిధిలోని కర్నూల్ మెడికల్ కాలేజీలో ఆయన ఎంబీబీఎస్ పట్టా పొందారు. ఉస్మానియా వర్శిటీ నుంచి ఎంబీఏ డిగ్రీ తీసుకున్నారు. ఆయన సాంకేతికపరంగా, పాలనాపరంగా అత్యంత సమర్థుడిగా గుర్తింపు పొందారు. రైల్వేల నిర్వహణలో సారథ్యాన మరింత ప్రగతి సాధిస్తుందన్నారు.

ఉదాసీనతను విడనాడకుంటే చర్యలు తప్పవు

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ఉదాసీనతను విడనాడాలని ప్రతి అర్జీపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌ను ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని, ప్రజల సమస్యల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం, సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే పోసిబాబు, ఏసీపీ కే వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



లోపలికి ప్రవేశం లేకపోవడంతో మూలపాడు నగరవనం మెయిన్ గేటు వద్ద ఫొటోలు తిగుతున్న సందర్శకులు

ప్రతి సోమవారం నగరవనం ప్రవేశం లేదు

● నిరాశగా వెనుదిరిగిన సందర్శకులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూలపాడు నగరవనంలో జిప్‌లైన్ ట్రయిల్ రన్, రహదారి మరమ్మతుల నిమిత్తం ప్రతి సోమవారం సీతాకోక చిలుకల పార్క్‌లోనికి ప్రవేశం నిలిపివేస్తున్నట్టు డీఆర్వో శివ ప్రసాద్ సోమవారం తెలిపారు. సోమవారం నగరవనం సందర్శనకు వచ్చిన వారికి మరమ్మతుల నిమిత్తం లోనికి అనుమతి నిరాకరించడంతో నిరాశగా వెనుతిరిగారు. చాలా మంది మెయిన్ గేటు ముందు ఉన్న ఫౌంటేన్, సీతాకోకచిలుకల బొమ్మల వద్ద ఫొటోలు దిగారు. ఎంతో ఆశగా దూర ప్రాంతాల నుంచి నగరవనం అందాలను చూసేందుకు వచ్చామని లోనికి అనుమతించకపోవడంతో వెళ్లిపోతున్నామని పలువురు సందర్శకులు వాపోయారు. మూలపాడు వద్ద ఎన్‌హెచ్ పక్కనే నగరవనం ప్రవేశ రహదారిలో సోమవారం ప్రవేశం లేదని కట్టిన కొద్దిపాటి ఫ్లెక్సీ సందర్శకులకు సరిగ్గా కనిపించకపోవడం వల్ల 4 కిలో మీటర్ల దూరం లోనికి వచ్చి వెనుతిరగాల్సి వచ్చింది. మెయిన్ రోడ్డు వద్ద సోమవారం ప్రవేశం లేదనే బోర్డు పెద్దదిగా ఏర్పాటు చేస్తే సందర్శకులు ఇంత దూరం రాకుండానే మెయిన్ రోడ్డు మీద నుంచే వెనుతిరిగి వెళ్లిపోతారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు మెయిన్ రోడ్డు వద్ద పెద్ద బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



చెవుటూరులో లారీలు ఆపి నిరసన తెలుపుతున్న స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్

బూడిద లారీలను అడ్డుకున్న లారీ డ్రైవర్లు

జి.కొండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్ బూడిద చెరువులోని బూడిదను మైలవరం నియోజకవర్గంలోని అందరు ట్రాన్స్‌పోర్టర్స్‌కు ఉచితంగా లోడింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై వెళుతున్న బూడిద లోడుతో వెళుతున్న లారీలను చెవుటూరులో స్థానిక ట్రాన్స్‌పోర్టర్ నిలిపివేశారు. ఎన్టీటీపీఎస్ కాలుష్య ప్రభావిత ఏడు గ్రామాలతో పాటు నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌పోర్టర్స్ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. వారి నిరసనకు సీఐటీయు నేతలు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.



పత్తి చేను మేస్తున్న మేకలు

కష్టాల్లో పత్తిరైతులు

● తుఫానుతో కకావికలమైన చేలు
● నిబంధనల పేరుతో ధాన్యం కొనని సీఐఐ

ఆంధ్రజ్యోతి - కంచికచర్ల: ఒకవైపు అతివృష్టి, మరోవైపు మొంథా తుపాను ప్రభావంతో పత్తి చేలు కకావికలమైపోయాయి. కొద్దిపాటి దిగుబడి వచ్చినా సీసీఐ విధించిన అనేక నిబంధనలతో పెట్టడంతో మద్దతు ధర లభించటం దీంతో లేదు. వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మేయాల్సి వస్తోంది. పత్తితీత ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో పాలకులు స్పందించటం లేదు. చేయూతను అందించడం లేదు. ఇదీ కళ్లు చెమర్చే కడు దయనీయ పరిస్థితుల్లో కొట్టామిట్టాడుతున్న పత్తి రైతులు దీనస్థితి ఇది. ఒక రైతు బాధ కాదు, ఒక ఊరి కథ అంతకన్న కాదు.. పత్తి రైతులందరిదీ ఇదే వ్యథ, ఇదే గాథ. వత్సవాయి మండలం సింగవరం గ్రామానికి చెందిన కౌలు రైతు రామ్మూర్తి నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఎకరానికి రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. వారం క్రితం పత్తి తీయగా, ఎకరానికి రెండు క్వింటాళ్ల వంతున 10 క్వింటాళ్ల పత్తి చేతికి వచ్చింది. కానీ కొనేనాథుడు లేక అమ్మలేదు. చేలో కొద్దిగా పత్తి ఉంది. దాన్ని తీసినప్పటికీ కూలి ఖర్చులు రాని దుస్థితి. ఈ పరిస్థితిలో ఎకరం చేను రూ. వెయ్యి వంతున జీవాల మేతకు కాపరులకు విక్రయించాడు. తీవ్ర నష్టాలతో నిలువునా మునిగిపోయిన రామ్మూర్తి కన్నీళ్లు పెడుతున్నాడు. ఈ దైన్య పరిస్థితిని ఎదుర్కోలేక ఎంతోమంది రైతులు పత్తి చేలను తొలగిస్తున్నారు. రెండో పంటగా మొక్కజొన్న లేదా శనగ సాగు చేయాలని యోచిస్తున్నారు. అలాగే పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు 20 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. ప్రస్తుతం ఎకరానికి ఐదు క్వింటాళ్ల వంతున వంద క్వింటాళ్ల వరకు పత్తి వచ్చింది. ఒక కల్యాణమండపం ఆవరణలో పత్తి ఆరబెట్టాడు. అమ్ముకునేందుకు అవకాశం లేక పక్షం రోజుల నుంచి పలు ఇబ్బందులు పడుతున్నాడు. సీసీఐకు అమ్ముదామంటే నిరాశే ఎదురైంది. పాలకుల వాగ్దానాలు ప్రకటనలకే పరిమితి అవుతున్నాయి తప్పితే కార్యరూపం దాల్చటం లేదు. మద్దతు ధర అందని ద్రాక్షగా తయారైంది. మార్కెట్లో దళారులు, వ్యాపారులు ఆడిందే ఆట, పాడిందే పాట. చాలా తక్కువ ధరకు అడుగుతున్నారు. పత్తి బాగున్నప్పటికీ క్వింటా రూ.6వేలకు మించి కొనటం లేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాక వెంకటేశ్వర్లు తీవ్ర ఆందోళనతో సతమతమవుతున్నాడు.



రైతు వెంకటేశ్వర్లు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

మంటాడ వెంకన్న హుండీ ఆదాయం రూ. 4.79 లక్షలు

పమిడిముక్కల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంటాడ అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ తెరచి లెక్కించగా రూ.4,79,549 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారి వీకేడీ ప్రసాద్ తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు అనురాధ, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అగస్త్యరాజు రామమోహనరావు, సమక్షంలో హుండీ తెరచి లెక్కించగా 91 రోజులకు రూ. 479,549 ఆదాయం లభించినట్టు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థికి బంగారు పతకం

గుడివాడ, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూజివీడు, బీఎస్ పాఠశాలలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన గూడవల్లి రాకేష్ వీరమాధవ్ జిల్లా జట్టుతరుపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.పద్మావతి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థి మాధవ్‌ను అభినందించారు. విద్యార్థి మాధవ్‌ను పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, యమ్.సత్య అన్వేష్‌లను మహిళ సంఘం సభ్యులు అభినందించారు.


మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వరరావు

పూలే విగ్రహాల వద్ద చెత్త వేయొద్దు

గుడివాడ : స్థానిక జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద చిరువ్యాపారులు తోపుడుబండ్లను పెట్టి వ్యర్థాలను పడవేస్తున్నారని, చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాల వద్దకు వెళ్లడానికి వీల్లేకుండా బ్యానర్లు, తోపుడు బండ్లు పెడుతున్నారని, వాటిని ఖాళీ చేయించి చుట్టూ పక్కల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగస్తి ఆదివిష్ణు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, రాష్ట్ర కార్యదర్శి నైనవరపు శేషబాబు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

• ఏడీఏ సూరపనేని కవిత


వలివర్తిపాడులో..

గుడివాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఏడీఏ సూరపనేని కవిత పేర్కొన్నారు. సోమవారం వలివర్తిపాడు తదితర గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా, సామాజికంగా అనేక రకాలుగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఆర్థిక ప్రయోజనం చేకూర్చటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూచిపూడి : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 2వ తేదీ వరకు నిర్వహించే రైతన్న మీకోసం కార్యక్రమాలను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులను స్వయంగా కలసి సీఎం సందేశం, ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు తీసుకునే చర్యలను వివరిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. ఏవో సురేష్‌బాబు నాయక్ పాల్గొన్నారు.

పామర్రు : వ్యవసాయరంగాన్ని లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంచసూత్రాల సమగ్ర సమాచారంతో గ్రామాల్లో చారిత్రక ఉద్యమంగా రైతన్నల మధ్యకు తీసుకు వచ్చిందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్త యు.విజయబాస్కర రెడ్డి అన్నారు. సోమవారం కనుమూరు, కురుమద్దాలి గ్రామాల్లో పంచసూత్రాలతో మీకోసం రైతన్న కార్యక్రమాన్ని సంబంధిత శాఖ అధికారులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పంచసూత్రాలు నవశకానికి నాందికానున్నయన్నారు. ముఖ్యంగా నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, అన్నదాతసుఖీభవ, పీఎం కిసాన్ వంటిపథకాలతో రైతన్నలకు ప్రభుత్వం అందించే మద్దతును రైతన్నలకు వివరించారు. పామర్రు వ్యవసాయ సబ్‌డివిజన్ అధికారి బి.స్వర్ణలత మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులను తగ్గింపు కోసం గ్రామాల్లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ అనుసంధాన కేంద్రాలో ఎరువులు తక్కువధరకు కొనుగోలు చేసుకోవాలన్నారు. ఉండ్రపూడి వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు , వీఏఏలు శ్రావణి, సతీష్, పాల్గొన్నారు.

పమిడిముక్కల : వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా మళ్లించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి అన్నారు. పమిడిముక్కలలో సోమవారం రైతన్నా నీకోసం కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అన్నం పెట్టే రైతులను రాజులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతన్నా నీకోసం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి భార్గవి, ఏఈవో సునీల్ గవాస్కర్, పాల్గొన్నారు.


పామర్రులో..


నిడుమోలులో..

గుడ్లవల్లేరు: అన్నదాత సుఖీభవ ద్వారా రైతన్నలకు రెండు విడతలుగా నగదు వారి ఖాతాల్లో జమైన సందర్భంగా ప్రభుత్వం ప్రతీ రైతు కుటుంబాన్ని పలకరించే కార్యక్రమంగా రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామాల్లోని రైతుల ఇంటికి వ్యవసాయాధికారులు, సహాయకులు, వీఆర్వోలు, కూటమి నాయకులు వెళ్లి వారికి వనకూరిన లబ్ధిని వివరించారు. మండల వ్యవసాయధికారి సునీల్, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు, గుడ్లవల్లేరు టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు, వల్లూరుపల్లి నాగేశ్వరరావు, వీఆర్వో ప్రకాష్, కూరాడలో వీఆర్వో రవి, టీడీపీ గ్రామ అధ్యక్షుడునవాబు, ఉపాధ్యక్షుడు శీరం నాగరమేష్, పులి ప్రసాద్ పాల్గొన్నారు.


పమిడిముక్కలలో..


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రైతు కుటుంబాలకు అందేలా చూడాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, వీఆర్వోలకు రైతన్న మీ కోసం కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పథకాలు అందాలంటే వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది వెళ్లి రైతులకు ప్రయోజనాలు క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. ఎవరైనా అశ్రద్ధ వహిస్తే వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.


నేత్రాలను సేకరిస్తున్న వైద్యులు, లయన్స్ సభ్యులు

నేత్ర దానం

గుడ్లవల్లేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరుకు చెందిన పొట్లూరి స్వరాజ్యలక్ష్మి (96) ఆదివారం రాత్రి మృతి చెందారు. కాగా ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేకరించారు. ఆమె మరణాంతరం ఇరువురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత్రాలను దానం చేయడం అభినందనీయమని అని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ అన్నారు. లయన్స్ సభ్యులు పొట్లూరి సత్యనారాయణ మాతృమూర్తి స్వరాజ్యలక్ష్మి నేత్రాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యబృందం సేకరించింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, లయన్స్ జిల్లా చైర్‌పర్సన్ ఎ.వీరబద్రరావు, క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యారామ్

చెస్ పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీన నిర్వహించిన చెస్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో యమ్.ధియాన్ సుధాన్స్, యమ్.దినేష్ శ్రీరెడ్డిలు ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, కోచ్ స్వర్ణలతలను పాఠశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వేమవరంలో స్వచ్ఛరథం పర్యటన

గుడ్లవల్లేరు : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం గుడ్లవల్లేరు మండల స్వచ్ఛరథం సోమవారం వేమవరం గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పర్యటించింది. గ్రామస్థులు తమ వద్ద ఉన్న పనికిరాని ఇనుప, ప్లాస్టిక్ వస్తువులను స్వచ్ఛరథం నిర్వాహకులకు అందించి , నిత్యావసర సరుకులు తీసుకున్నారు.

పక్వానికి రాకుండా వరిని కోయొద్దు

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పక్వానికి రాకుండా వరిని కోయవద్దని, రైతులు అధికారుల సూచనలను పాటించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రైతు ధాన్యం విక్రయించిన ఒక్క గంట వ్యవధిలోనే రైతు ఖాతాకు ధాన్యం సొమ్ము జమౌతుందంటే కూటమి ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిబద్ధతతో పనిచేస్తోందో అర్థమౌతోందన్నారు. వ్యవసాయాధికారులు సైతం అలసత్వంగా ఉండవద్దని ఎమ్మెల్యే తెలిపారు.

శేరికల్వపూడిలో తాగునీటిని సరఫరా చేసే మోటారు సమస్య ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కాగా ఆయన రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్, పంప్ హౌస్‌లను పరిశీలించారు. 24 గంటల్లో మోటారు రిపేరు చేయించి సురక్షిత తాగునీటిని గ్రామస్థులకు సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. డీసీ వైస్‌చైర్మన్ చలసాని శ్రీధర్, శేరికల్వపూడి పీఏసీఎస్ చైర్మన్ అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యచౌదరి, అడుసుమిల్లి దీపక్‌చౌదరి, అట్లూరి స్వరూప్, చేకూరి జగన్మోహనరావు, కాటూరి కిషోర్, మురళి, దత్తు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

• ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. రొయ్యూరులో ఉపాధి హామీ నిధులు రూ. 5 లక్షలు, జడ్పీ నిధులు రూ. 5 లక్షలు కలిపి రూ. 10 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్-2 భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి పీ-4 పథకం కింద స్థానిక టీడీపీ నాయకుడు ఉప్పులూరి గోపాలకృష్ణ రూ. 1.05 లక్షలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాసు, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్, ఉప్పులూరి గోపాలకృష్ణ, రొయ్యూరు, చాగంటిపాడు పీఏసీఎస్ చైర్మన్‌లు రేణుకారావు, కళ్లం వంశీకృష్ణారెడ్డిపాల్గొన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కుమార్ రాజా పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.


అంగన్వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ : బొడ్డఆడులో బాణావతు లక్ష్మీకి రూ. 25,166, వల్లూరుపాలెంలో యార్లగడ్డ మురళీకృష్ణకు రూ 50వేలు, కంచర్ల వెంకటేశ్వరరావుకి రూ. 53,795, దేవరపల్లిలో ప్రొద్దుటూరి ఆక్షవాణికి రూ. 40వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కుమార్ రాజా స్వయంగా ఆయా గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.


గొరుముచ్చుకు పురస్కారం అందజేస్తున్న సాహితీవేత్తలు

గొరుముచ్చుకు బ్రౌన్ పురస్కారం

గుడివాడ, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డకు చెందిన ప్రముఖ కవి, రచయిత గొరుముచ్చు సూర్యనారాయణ సీపీ బ్రౌన్ సాహితీస్ఫూర్తి పురస్కారం-2025ను అందుకున్నారు. సోమవారం స్థానిక సుందరయ్యభవన్‌లో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన సీపీ బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథులు లింగం చిట్టిబాబు, డాక్టర్ కొడాలి సోమసుందరరావులు బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన పద్యాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి తెలుగువారి భాషా సంపదను మానవతా విలువలను సామాజిక సంఘటనలను బ్రిటీష్‌వారికి తెలియజేసిన మహావ్యక్తి బ్రౌన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కావూరి శ్రీధర్, ఆర్‌సీపీ రెడ్డి, లీలా ప్రసాద్, పి.అనీల్, షేక్ ఫరీద్‌బాషా, పాలపర్తి కిషోర్, వసుధ బసవేశ్వరరావు, తెలుగు బాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, పాల్గొన్నారు.

యలవర్తి సేవలు అభినందనీయం

గుడివాడ : పట్టణాభివృద్ధికి మున్సిపల్ చైర్మన్‌గా యలవర్తి చేసిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని యలవర్తి స్వగృహంలో ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులతో కలిసి కూటమి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్‌బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు చేకూరు జగన్మోహనరావు, మజ్జి శ్రీనివాస్, నిమ్మగడ్డ సత్యసాయి, సాయన రాజేష్, వేమూరి త్రినాద్, శొంఠి రామకృష్ణ, వసంతవాడ దుర్గారావు, కృష్ణారావు, పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

గుడివాడ : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రత్యేక అవగాహన సమ్మేళనాలను నిర్వహిస్తున్నామని ఐఎంఏ సభ్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక విద్యాలయ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న గుడివాడ సైక్లోథాన్-2025లో భాగంగా డ్రగ్స్ ఫ్రీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, సైకిల్ క్లబ్ సభ్యులు తుమ్మల శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే వ్యర్థాలు .. తప్పని తిప్పలు

కూచిపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుకు తరలించాల్సిన వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది మొవ్వ పంచాయతీ పరిధిలోని హోలీ స్పిరిట్ పాఠశాల సమీపానికి తరలిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లి విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డంపింగ్ యార్డులో ఉన్న దాని కన్నా ఎక్కువ మొత్తంలోనే చెత్తచెదారాలను రోడ్ల పక్కన పడవేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ వ్యర్థాలు తొలగించమంటే తమ పరిధి కాదంటే, తమ పరిధి కావని మొవ్వ, పెదపూడి పంచాయతీలకు చెందిన అధికారులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ఆ వ్యర్థాలు తొలగించాల్సిందిగా డీఎల్‌పీవో సంపత్ కుమారి మొవ్వ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ సిబ్బంది సోమవారం గుట్టలుగా పడి ఉన్న వ్యర్థాలు తగలబెట్టగా, వాటి నుంచి వచ్చే పొగతో పాఠశాల విద్యార్థులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరై తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


వ్యర్థాలను తగలపెట్టడంతో దట్టంగా అలుముకున్న పొగ

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

తోట్లవల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరులో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరంలో వందమంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు రత్నకుమారి, ప్రసన్న, లుక్కా నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

గుడివాడ : అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై గృహహింస చట్టం కింద కేసు నమోదైంది. పెదపారుపూడికి చెందిన అంగడాల కార్తీక్‌తో 2016లో గౌరీశంకరపురానికి చెందిన రేవతికి వివాహమైంది. వివాహ సమయంలో రూ.25లక్షలు కట్నం, రూ.5లక్షల సారె, బంగారం సమర్పించారు. అధిక కట్నం తీసుకురావాలంటూ తనను హింసిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ గణేష్‌కుమార్ తెలిపారు.

ఆకాశంలో మబ్బులు .. ఆందోళనలో అన్నదాతలు


గురజాడ పరిధి పొలాల్లో వరిపనలు కట్టి కుప్పలు వేస్తున్న కూలీలు

పమిడిముక్కల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుతో ఆకాశంలో మబ్బులు కమ్ముతున్న పరిస్థితులతో పాటు అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందన్న హెచ్చరికలతో వరికోతలను, కోసిన పంట కట్టి కుప్పలు వేసేందుకు రైతులు తొందర పడుతున్నారు మండల పరిధిలో 20,450 ఎకరాల్లో వరి సాగుచేయగా ఇప్పటివరకు 30 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. కూలీల కొరత,హెచ్చు కూలీ రేట్లతో యంత్రాల ద్వారా కోత కోసేందుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కోతకోసే యంత్రాలు సైతం తక్కువగా ఉన్న నేపథ్యం, పక్క రైతు పొలంలో యంత్రాలతో కోయిస్తున్నారు. మరలా యంత్రాలు వస్తాయో, లేదో అన్న సందేహంతో పక్వానికి రాని ధాన్యాన్ని సైతం రైతులు కోయిస్తున్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు అవకాశం లేక తేమ శాతం ఎక్కువగా ఉన్నా, ప్రభుత్వ మద్దతు ధర రాకపోయినా ఎంతో కొంత వస్తుందిలే అని మిల్లర్లకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. ఇదే అదనుగా కొంతమంది మిల్లర్లు, దళారులు రైతుల నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారు. ఇదిలా ఉండగా కూలీలతో కోయించి పొలాల్లో పనల్లపై ఉన్న పంటను కాపాడుకునే ఆతృతతో అడిగినంత కూలి ఇచ్చి కుప్పలు వేయిస్తున్నారు. పక్వానికి రాని ధాన్యం కోత కోయిస్తే తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల రైతులు నష్టపోవలసి వస్తుంది. పంట పూర్తిగా తయారైన తరువాతే కోయించాలని అధికారులు సూచిస్తున్నారు.

పెదపారుపూడి : వరి నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. యంత్రాల సాయంతో రైతులు కోతలు కోసి ధాన్యం ఆరబెట్టారు. కొనుగోళ్లు లేకపోవటంతో గ్రామాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రైతు సేవా కేంద్రంలో సంచులు కొరత ఏర్పడింది. యలమర్రు రైతు చెరుకూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ యలమర్రు గ్రామంలో 50 లారీల వడ్లు కాట పెట్టి రోడ్ల మీద ఉన్నవి. వర్షపు సూచనలతో రైతులు భయపడుతున్నారు. తహసీల్దార్ సకాలంలో స్పందించి లారీలు ఏర్పాటు చేయించాలని లేదా ఆఫ్‌లైన్‌లో వెళ్లే ఏర్పాటు అత్యవసరంగా చేయాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో సంచులు సైతం అందుబాటులో లేవని రైతులు తెలుపుతున్నారు.


యలమర్రు రోడ్డుపై విక్రయానికి సిద్ధపరిన ధాన్యం బస్తాలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సైలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు సోమవారం ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడును కలిశారు. చల్లపల్లి ఎస్సై కె.వై.దాస్, మోపిదేవి ఎస్సై గౌతమ్‌కుమార్, కూచిపూడి ఎస్సై పి.శిరీష ఎస్పీని మర్యాద పూర్వంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వారికి సూచించారు. అసాంఘిక శక్తులను అణచివేయడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభను ప్రదర్శించాలన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రూ.50 కోట్లతో నియోజకవర్గంలో మౌలికసదుపాయాలు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం ఎస్ఎన్‌గొల్లపాలెంలో కోటి రూపాయలతో నిర్మించే రోడ్డు పనులకు, ఘంటలమ్మపాలెంలో రూ.75 లక్షల నిధులతో నిర్మించే రోడ్డు పనులకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. త్వరలో గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, జల్ జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి అందిస్తామన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, తలారి సోమశేఖర్, మధు, శ్రీనివాసరావు, అమ్మిరెడ్డి శివ, వేణు, మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ యువకుమార్

అవనిగడ్డ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సీఐ యువకుమార్ అన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయంలో సోమవారం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో కేవీకే మూర్తి నేతృత్వంలో మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ హెరాయిన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకునే వారి వివరాలు 1902కు సమాచారం అందించాలని కోరారు. ఈగల్ టీమ్ సభ్యులతోపాటు నార్కొటిక్స్ అనుబంధ విభాగానికి చెందిన కొల్లిపర రాధాకృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరకుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి సౌకర్యాల గురించి తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు వ్యవసాయ పాలిటెక్నిక్ సందర్శన

ఘంటసాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రియ లలిత నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఏ కోర్సులు నిర్వహిస్తున్నారు? ఎంతమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలుత ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడుకు కోడూరు నేతల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కోడూరు టీడీపీ నాయకులు

కోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి అచ్చెన్నాయుడుకు మండల టీడీపీ నేతలు వినతిపత్రం అందించారు. ఘంటసాల విచ్చేసిన మంత్రిని టీడీపీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కలిసి కోడూరు మండలంలో 22ఏ సమస్యలను, అవుట్‌ఫాల్ స్లూయి జ్ దెబ్బతిన్న కారణంగా ఐదేళ్లుగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. టీడీపీ టౌన్ అధ్యక్షులు పూతబోయిన శ్రీనివాసరావు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాల కావిడిలు

మోపిదేవి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి అయ్యప్ప దీక్షాపరులు పాలకావిడలను సమర్పించారు. నాగాయితిప్ప గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు పాలకావిడలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. దీక్షాధారులు తీసుకువచ్చిన పాలు నాగపుట్టలో పోసి, స్వామి వారికి అభిషేకం జరిపారు.

అద్దంకి నాంచారమ్మకు వేడి నైవేద్యాలు



కోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మ వారికి గ్రామస్థులు వేడి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం రాత్రి డప్పువాయిద్యాల మధ్య భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. అందరి పంటలు ఇంటికి చేరాలని, గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుతూ నైవేద్యాలు సమర్పించినట్లు భక్తులు తెలిపారు. ఈవో జయశ్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఎస్.ఎన్.గొల్లపాలెంలో రైతన్నా..మీకోసం కరపత్రాలు అందజేస్తున్న మంత్రి రవీంద్ర, యార్లగడ్డలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ కనకదుర్గ, నందమూరులో రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత

అన్నదాత శ్రేయస్సే లక్ష్యంగా రైతన్నా..మీకోసం

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం రైతన్నా..మీకోసం చేపట్టిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సీఎం పంపిన లేఖలోని సారాంశాన్ని మంత్రి కొల్లు రవీంద్ర వినిపించారు. ప్రతి ఎకరాకు నీరు అందేలా జలాశయాలను నింపుతామన్నారు. చిరు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తామన్నారు. వ్యవసాయంలో సాంకేతికత విప్లవాన్ని ప్రతి ఇంటికి చేరేలా చేస్తామన్నారు. డ్రిప్ స్ప్రింకర్లు రాయితీపై అందజేస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసిగ్ ఫుడ్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయం లో ఎకరాకు రూ.10వేల చొప్పున ఇస్తామన్నారు. పాడి రైతులకు అండగా ఉంటామన్నారు. గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రాంబాబు, ఎంపీడీవో వెంకటేష్, ఏవో ఎం.రామ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ హారిక పాల్గొన్నారు. 60 మంది దళిత రైతులకు రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

రైతుల నికర ఆదాయం పెంచేందుకే..

చల్లపల్లి : రైతుల అభివృద్ధే ధ్యేయంగా, అధునాతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి రైతుల నికర ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ అన్నారు. యార్లగడ్డలో రైతన్నా.. మీకోసం కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 11 రైతు సేవాకేంద్రాల పరిధిలో 29వ తేదీ వరకు ప్రతి రైతుకూ పంచసూత్రాలపై అవగాహన కల్పించనున్నట్లు ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. రైతులకు అందుతున్న పథకాలు, కావాల్సిన వనరుల పట్ల సమగ్ర సర్వే చేపట్టి, తగిన కార్యాచరణ రూపొందించటం జరుగుతుందని వివరించారు. నీటిసంఘం అధ్యక్షులు తొట్టెంపూడి రాధాకృష్ణయ్య, మాజీ సర్పంచ్ బొబ్బా కృష్ణారావు, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఇబ్రహీం, కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, వీఆర్వో ఎం.అమలేశ్వరరావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. వక్కలగడ్డలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మల్లుపెద్ది దుర్గామహేష్ పాల్గొన్నారు.



కోసూరువారిపాలెంలో రైతన్నా..మీ కోసం ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

మోపిదేవి : రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ముఖ్య లక్ష్యం అని అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి. సాయిబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం మండలంలోని కోసూరువారిపాలెంలో ప్రారంభించారు. రైతన్నా మీకోసం పోస్టర్లను ఆవిష్కరించి, ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని వివరించారు. తహసీల్దార్ ఎం.హరినాథ్, ఏవో హెబ్సిబా రాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.



గూడూరులో కరపత్రాలు అందజేస్తున్న పోతనస్వామి

రైతును రాజును చేసేందుకే

గూడూరు : రానున్న ఐదు సంవత్సరాల్లో రైతును రాజును చేసే లక్ష్యంతో రైతన్నా మీకోసం చేపట్టిందని డీసీ చైర్మన్ పోతన స్వామి అన్నారు. గూడూరులో రైతన్న నీ కోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్‌ఏ బేగ్, జనసేనపార్టీ అధ్యక్షుడు బాసంశెట్టి విజయ్, వీఆర్వో షేక్ కరీముల్లా, పం చాయతీ సెక్రటరీ టి.వి.భాస్కరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ పూజ ప్రియదర్శిని పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే...

పెడన రూరల్ : రైతు సమస్యలను గుర్తించిపరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నందమూరు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో అధికారులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లాభసాటి వ్యవసాయం చేయాలని, సేంద్రియ సాగుతో భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. వరి కోతలు జరుగుతున్న విధానంపై ఆరా తీశారు. ధాన్యం అమ్మిన వెంటనే డబ్బులు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉచితంగా టార్పాలిన్లు అందించారు. సబ్సిడీపై టార్పాన్లను ఇవ్వాలని రైతులు కోరారు. గ్రామంలో పశు వైద్యశాలకు నూతన భవన నిర్మాణం చేయాలని రైతులు కోరారు. చెన్నూరు, కొప్పల్లి, కమలాపురం, నడుపూరు, బల్లిపర్రు, మడక, కాకర్లమూడి, పెనుమల్లి, శేరీవర్తర్లపల్లి గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎస్ జెన్ని, శీరం ప్రసాద్, పరసా రాంబాబు, మన్నె శ్రీనివాసరావు, పరసా నాగరాజు రైతులు పాల్గొన్నారు.



అర్తమూరులో రైతన్న మీకోసం కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తులసీరావు

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి : అర్తమూరు, మలపరాజుగూడెం, మల్లేశ్వరం గ్రామాల్లో సోమవారం రైతన్న మీకోసం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో రైతులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, ఏపీబీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర రంగనాథ్, బొర్రా కాశీ, భూపతి రమేష్, అర్తమూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు కాగిత బాలాజీ, టీఎన్ఎఫ్ అధ్యక్షుడు కాగిత రవి కుమార్, మల్లేశ్వరం సర్పంచ్ చెన్ను శ్రీనివాసరావు, సన్నాల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

స్టూడెంట్ అసెంబ్లీకి ఎంపికలో అన్యాయం

● న్యాయం చేయాలని చాందిని వేడుకోలు



పెడన, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్టూడెంట్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో తనకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని భట్ల మోహనరావు హైమావతి జడ్పీ హైస్కూల్ (తోటమూల హైస్కూల్) విద్యార్థిని పరసా చాందిని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేసింది. నిబంధనల ప్రకారం ప్రథమ స్థాయిలో నిలిచిన విద్యార్థులను స్టూడెంట్ అసెంబ్లీకి ఎంపిక చేసి పంపాలని, లోపం ఎక్కడ జరిగిందో ఏమో తెలియదు కానీ నియోజకవర్గ స్థాయింలో ప్రథమ స్థానంలో నిలిచిన తనను కాకుండా తనకన్నా తక్కువ స్థానం సాధించిన వేరొక విద్యార్థిని ఎంపిక చేసి తనకు అన్యాయం చేశారని వాపోయింది. తాను ఎంతో కష్టపడి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచానని, స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొని సమస్యలపై గళమెత్తుదామని ఆశపెట్టుకున్నానని చాందిని తెలిపింది. తనను ఎంపిక చేయకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యానని ఆమె పేర్కొంది. తనకు న్యాయం చేయాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు ఆమె విజ్ఞప్తి చేసింది.

స్వయంగా కొనుక్కుతింటే ఆ మజానే వేరు!



వేరుశెనగకాయలు, తేగలు కొనుక్కొంటున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తనకు ఇష్టమైనవి స్వయంగా కొనక్కుతిందామనిపించో ఏమో మరి మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం ఎస్ఎన్ గొల్లపాలెం వెళుతూ మధ్యలోనాగపోతరావు సెంటర్‌లో తేగలు, వేరుశెనగకాయలు కనపడగానే కారు దిగివచ్చారు. మేకావారిపాలెం గ్రామానికి చెందిన మహిళ పార్వతి వద్ద తేగలను, రెండు డబ్బాల వేరుశెనగకాయలు కొన్నారు. తనతో వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తేగలు, వేరుశెనగకాయలు పంచా రు. పీచుపదార్థాలు ఉన్న తేగలు ఎంతో మంచివన్నారు. ఉడకబెట్టిన వేరుశెనగకాయలు రుచి ఎంతో బాగుంటుందని, వాటిని తినడం వల్ల పిండిపదార్థంతో పాటు మాంసకృతులు లభిస్తాయన్నారు. మంత్రి కారుదిగి వచ్చి తేగలు కొనడం అందరినీ ఆశ్చర్యపరచింది.



ధాన్యం ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడుతున్న చల్లపల్లి తహసీల్దార్ వనజాక్షి

ధాన్యం దళారులకు అమ్మొద్దు : తహసీల్దార్

చల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ఆందోళనతో రైతులు ధాన్యాన్ని దళారులపాలు చేసుకోవద్దని తహసీల్దార్ డి.వనజాక్షి రైతులకు సూచించారు. జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టుకున్న రైతులను, యంత్రంతో వరికోతలు కోయిస్తున్న రైతులను కలిసి మాట్లాడారు. తుఫాను ప్రభావం ప్రస్తుతం మనకు పెద్దగా లేదన్నారు. హడావుడిగా కోతలు పూర్తిచేసిన రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పంటను అమ్ముకోవద్దని చెప్పారు. ధాన్యం తేమశాతం తగ్గించుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని కోరారు. తేమశాతంలో ఇబ్బందులు ఎదురైనా, మిల్లర్లు ధరలో కోత విధించినా, రైతులకు ఎలాంటి సమస్య ఎదురైనా తనను సంప్రదించాలని సూచించారు.

గాయకుడు రమణపై చర్యలు చేపట్టాలి : ఫణికుమార్



చిలకలపూడి సీఐ నబికి ఫిర్యాదు చేస్తున్న పివిఫణికుమార్ తదితరులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణులను కించపరిచే విధం గా పాట పాడిన గాయకుడు రమణపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ చిలకలపూడి సీఐ నబీకి బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ పి.వి.ఫణికుమార్ ఫిర్యాదు చేశారు. జంధ్యం బ్రాహ్మణులతో పాటు వైశ్యులు, విశ్వబ్రాహ్మణులు ధరిస్తారన్నారు. జంధ్యం గాయిత్రీ మాతకు ప్రతి రూపమన్నారు. పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోక పోతే కోర్టులో ప్రైవేటు కేసు వేస్తామన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకులు మోపర్తి సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఆర్ శర్మ పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 250 మందికి బీఎండీ పరీక్షలు

చల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ ట్రస్ట్ సహకారంతో చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఎండీ పరీక్షకు మంచి స్పందన లభించింది. 250 మందికి అస్టియోపోరోసిస్‌ను నిర్ధారించేందుకు బీఎండీ పరీక్షలను డాక్టర్ తమ్మన సాయి మణికంఠ చేసి మందులు అందించారు. ఆహార నియమాలను తెలియచేశారు. సీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పరుచూరి శ్రీనివాసరావు, అడ్డాడ ప్రసాద్‌బాబు పర్యవేక్షించారు.

గౌడసంఘం రాష్ట్రనేత బొల్లాకు ఘనసన్మానం



బొల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న గౌడ సంఘీయులు

చల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గౌడ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన వెలివోలు గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్‌ను చల్లపల్లిలో గౌడ సంఘీయులు సన్మానించారు. గౌడపాలెం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద చల్లపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్, గీత సంఘం అధ్యక్షుడు వేముల సాయిబాబు వెంకటేశ్వరరావు గౌడ్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సొసైటీ డైరెక్టర్ వేముల హరికృష్ణ, టీడీపీ నేత బెల్లంకొండ అర్జునరావు, పామర్తి నాని, లుక్కా రాఘవులు, మురారి సత్యనారాయణ, రాఘవులు, వెలివోలు ప్రముఖులు బొల్లా పెద్దబ్బాయ్, తలశిల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టారు మద్దిబోయినకు ఎన్టీఆర్ కలెక్టర్ సన్మానం



మద్దిబోయినకు మెమొంటో అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

బంటుమిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాంస్కృతిక సంబరాలలో అత్యంత ప్రతిభను కనబరిచిన సాతులూరు గ్రా మానికి చెందిన మద్దిబోయిన నాగసత్యనారాయణను ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశ ఘనంగా సన్మానించారు. విజయవాడలో ఇటీవల జరిగిన జాతీయ సాంస్కృతిక కవి సమ్మేళనంలో పెదతుమ్మిడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పీజీటీ సత్యనారాయణను లక్ష్మీశ దుశ్శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. సాతులూరు సర్పంచ్ బాలస్వామి, ఏఎమ్‌సి డైరెక్టర్ వక్కలగడ్డ కరుణకుమార్, మాజీ సర్పంచ్ చోడవరపు రాధాకృష్ణ, గ్రామ ప్రముఖులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మాజేరు టీడీపీ నేత వెంకట్రామయ్యకు సతీవియోగం

చల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తమాజేరు పాల కేంద్రం అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు తుమ్మల వెంకట్రావ్(తాతయ్య)కు సతీవియోగం కలిగింది. తాతయ్య సతీమణి ఝాన్సీ (75) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆమెకు భర్త తాతయ్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ కళ్లేపల్లి లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, కూటమి నేతలు బొర్రా అగ్గిరాముడు, ఎపి.చంద్రశేఖరరావు, కమ్మిలి పెదబాబు, చోడగం విమల్‌కృష్ణ, తుమ్మలగుంట గోపాలకృష్ణ, జంధ్యం మోహనరావు, ఏనుగు రత్తయ్య, టీఎన్‌యూఎస్ రాష్ట్ర నేత కైతేపల్లి దాస్ తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.